Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 128 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

మంగళవారం, 25 - 11 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## అయోధ్యలో పర్యటించనున్న మోదీ..రామాలయంపై పతాకావిష్కరణ




**అయోధ్య:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అయోధ్యలోని రామ జన్మభూమి మందర్‌ను ఈనెల 25న దర్శించనున్నారు. రామాలయ నిర్మాణం పూర్తయినందుకు సంకేతంగా శ్రీరామజన్మ భూమి మందిర శిఖరంపై పతాకాన్ని ఆయన ఆవిష్కరిస్తారు. ఈ ఘట్టం దేశ సామాజిక-సాంస్కృతిక-ఆధ్యాత్మిక ప్రయాణంలో మరో మైలురాయిగా పేర్కొంటున్నారు. ఇదేరోజు మార్గశిర మాసంలోని శుక్లపక్షంలో వచ్చే పంచమి కావడం, ఇదే అభిజిత్ ముహూర్తంలో సీతారాముల వివాహ పంచమి కూడా కావడం విశేషం. సిక్కుల తొమ్మదవ గురువు గురుతేజ్ బహదూర్ ఆత్మబలిదాన దినోత్సం కూడా ఇదే రోజు వస్తోంది. 17వ శతాబ్దంలో అయోధ్యలో గురుతేజ్ బహదూర్ 48 గంటలసేపు ధ్యాన్యం చేశారు.

**సప్తమందిర్‌ను దర్శించనున్న ప్రధాని**

ప్రధానమంత్రి మంగళవారం ఉదయం 10 గంటలకు వశిష్ట, విశ్వామిత్ర, అగస్త్య, వాల్మీకి, దేవి అహల్య, నిషదరాజు గుహుడు, శబరి మాత మందిరాలతో కూడిన సప్తమందిర్‌ను దర్శిస్తారు. 11 గంటలకు శేషావతార్ మందిర్, మాతా అన్నపూర్ణ మందిరాలను దర్శించుకుంటారు. రామ దర్బార్ గర్భగృహం, రామలీలా గర్భగృ హంలో పూజల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో శ్రీ రామజన్మ భూమి మందిర్ శిఖరంపై కాషాయం రంగు పతాకాన్ని ప్రధాని ఆవిష్కరిస్తారు. ఈ సందర్భంగా రామ రాజ్యం ఆదర్శాలు, జాతీయ సమైక్యత, భారతదేశ సమున్నత వారసత్వంపై ప్రధాని ప్రసంగిస్తారు. రామమందిరానికి సహాయం చేసిన దాతలను ఈ వేడుకలకు అధికారికంగా ఆహ్వానించనున్నట్టు ట్రస్ట్ ఇప్పటికే ప్రకటించింది. దేశం నలుమూలల నుంచి సుమారు 8000 మంది ఆహ్వానితులు ఈ ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొంటారని అంచనా వేస్తున్నారు.

## శ్రామిక చట్టాలకు నూతన శకం : కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్



**అమరావతి, (రాజధాని వార్తలు):** భారతదేశంలో శ్రామిక చట్టాలకు కొత్త శకం ఆరంభమైంది.కేవలం చారిత్రక సంస్కరణ మాత్రమే కాదు, దేశంలోని ప్రతి శ్రామికుడికి గౌరవాన్ని మరియు భద్రతను కల్పించే దిశగా ఎన్డీయే ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోవడం హర్షణీయం కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. కేంద్రప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయంతో కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపనున్నాయి. దశాబ్దాలుగా అమలులో ఉన్న కార్మిక చట్టాల స్ధానంలో నాలుగు కార్మికకోడ్‌లను అమలు చేయడంవల్ల దేశ వ్యాప్తంగా కార్మికులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. నూతన కార్మిక చట్టాలు దేశాభివృద్ధికి బాటలు వేసే సంస్కరణలు. దేశంలోని కార్మిక చట్టాల చరిత్రలో ఇది ఒక గొప్ప సంస్కరణగా నిలుస్తుంది. సరళత, పారదర్శకత, సమర్ధత,కార్మికుల సంక్షేమానికి నాలుగు నూతన కార్మిక చట్టాలు దోహదపడతాయి. నూతన చట్టాల వల్ల కీలక మార్పులతో అందరికీ సాంఘీక భద్రత, అసం ఘటిత రంగం, గిగ్ వర్కర్లు, ప్లాట్ పార్మ్ వర్కర్ల వంటి వర్గాలకు కూడా రక్షణ పొందే అవకాశం లభించింది. నూతన కార్మిక చట్టాలతో పరిశ్రమలకు సరళీ కృత విధానాలు, పెట్టుబడులు, ఉత్పత్తి, ఉద్యోగావకాశాలు పెరిగేలా వ్యవస్ధను రూపొందించారు. అంతేకాకుండా వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, తదితర అంశాలు ఈ చట్టాలతో మెరుగైన పద్ధతిలో అమలు చేయడానికి అవకాశం ఉంటుంది. ఈ చట్టాలు కాగితాలపైనే కాకుండా కార్మికుల జీవితాల్లో మార్పు తీసుకు వస్తాయి. ఇప్పటివరకు ఉన్న 29 పాత కార్మిక చట్టాలను సరళతరం చేస్తూ, దేశంలోని 40 కోట్ల మందికి పైగా కార్మికులకు కనీస వేతనం, సామాజిక భద్రత, గ్రాట్యుటీ వంటి కీలక ప్రయోజనాలకు హామీ లభిస్తున్నది. దేశంలోని 40 కోట్ల మంది, మరి ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సంఘటిత, అసంఘటితక రంగాల్లోని లక్షలాది మంది కార్మికులకు కనీస వేతనం, సామాజిక భద్రత, గ్రాట్యుటీ వంటి కీలక ప్రయోజనాలను లభించనున్నాయి. తాజా కోడ్‌లలో మహిళలకు హక్కులు, భద్రతను మరింత పెంచడం, ప్రమాదకరమైన ప్రాసెసింగ్ కేంద్రాలు సహా అన్ని చోట్లా దేశవ్యాప్తంగా ఈఎస్ఐ సౌకర్యం కల్పించడం, సింగిల్ రిజిస్ట్రేషన్, లైసెన్స్, రిటర్న్ వ్యవస్థలు ఏర్పాటు (మిగతా 2వ పేజీలో)

## స్మార్ట్ ఫ్యామిలీ కార్డ్.. ఇదే మా లక్ష్యం



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టంపై అధికారులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుటుంబ సమగ్ర సమాచారంతో స్మార్ట్ ఫ్యామిలీ కార్డ్ ఉంటుందన్నారు. రియల్ టైమ్ గవర్నెన్స్ డేటా లేక్‌తో కుటుంబం, వ్యక్తుల వివరాలను సేకరించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ పథకాలు, పౌరసేవల పర్యవేక్షణకు స్మార్ట్ ఫ్యామిలీ కార్డ్ ఒక్కటే ఉంటుందని తెలిపారు. కుటుంబ సాధికారిత కోసం ఈ వ్యవస్థను వినియోగించాలని చంద్రబాబు సూచించారు. కుటుంబం ఒక యూనిట్‌గా ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టం అమలు చేయాలని సీఎం పేర్కొన్నారు.

**జూన్ నాటికి స్మార్ట్ ఫ్యామిలీ కార్డ్**

రాష్ట్రంలోని 1.4 కోట్ల కుటుంబాలకు జూన్ నాటికి క్యూఆర్ కోడ్‌తో కూడిన ఫ్యామిలీ కార్డును జారీ చేయాలని అధికారులకు సూచించారు. 25 రకాల సేవలతో పాటు పీ4 లాంటి అంశాలను అందులో చేర్చాలని తెలిపారు. ఆర్టీజీఎస్ వద్ద ఉన్న సమాచారాన్ని ప్రామాణికంగా తీసుకుని ఇతర ప్రభుత్వ శాఖలు వినియోగించుకోవాలని చెప్పారు. స్టాటిక్ డేటా, డైనమిక్ డేటా వివరాలను కూడా ఎప్పటికప్పుడు నమోదు చేసేలా చూడాలన్నారు.

**ఇదే మా లక్ష్యం**

వాక్సినేషన్, ఆధార్, ఎఫ్‌బీఎంఎస్ ఐడీ, కుల ధృవీకరణ, పౌష్టికాహారం, రేషన్ కార్డు, స్కాలర్‌షిప్, పెన్షన్లు సహా వేర్వేరు ప్రభుత్వ పథకాలు, సేవలకు సంబంధించిన వివరాలన్నీ ఈ కార్డు ద్వారా ట్రాకింగ్ జరిగేలా చూడాలన్నారు. కేవలం పెన్షన్లు, రేషన్ వంటి పథకాల వివరాలకు మాత్రమే ఈ ఎఫ్‌బీఎంఎస్ వ్యవస్థను పరిమితం చేయొద్దని, పౌరులకు చెందిన అన్ని వివరాలనూ నమోదు చేసేలా ఈ కార్డు ఉండాలని ఆదేశించారు. సుపరిపాలనలో భాగంగా ఈ కార్డు ద్వారా అర్హులైన వారందరికీ పథకాలు అందించటంతో పాటు సులభంగా పౌర సేవలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కొన్ని పథకాలకు లబ్దిదారుల ఎంపికలో ఎదురవుతున్న సవాళ్లు కూడా ఈ వ్యవస్థ ద్వారా పరిష్కారం అవుతాయని స్పష్టం చేశారు.

**ఎప్పటికప్పుడు అప్డేట్ అవ్వాలి**

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో స్వర్ణాంధ్ర విజన్ యూనిట్ ద్వారా కుటుంబ వివరాలు ఎప్పటికప్పుడు అప్డేట్ అయ్యేలా చూడాలన్నారు. ఫ్యామిలీ కార్డును స్మార్ట్ కార్డుగా జారీ చేయాలని, ఒకే కార్డు ద్వారా పౌరులు అన్ని ప్రభుత్వ సేవల్ని, పథకాలను అందేలా చూడాలని స్పష్టం చేశారు. ఆధార్ సహా అన్ని వివరాలు ఈ ఒక్క కార్డు ద్వారానే తెలిసేలా రూపొందించాలని చెప్పారు. 2026 జనవరి నాటికి పూర్తి సమాచారాన్ని క్రోడీకరించి జూన్‌లోగా కార్డులు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.

## డిప్యూటీ సీఎం పవన్ పర్యటనలో తెలుగు తమ్ముళ్ల మధ్య ఫైట్



**రాజమండ్రి, (రాజధాని వార్తలు):** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యటనలో తెలుగు తమ్ముళ్ల మధ్య గొడవ జరిగింది. ఎయిర్ పోర్టులోకి రాజానగర్ టీడీపీ ఇన్‌ఛార్జి బొడ్డు వెంకటరమణను అనుమతించకపోవడంపై పోలీసులతో వాగ్వాదానికి దిగారు. సీఎం ప్రోగ్రాం కమిటీ సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్‌ను ఎలా అనుమతించారంటూ పోలీసులతో బొడ్డు వర్గం గొడవకు దిగింది. కాగా.. జిల్లా పర్యటనలో భాగంగా ఉపముఖ్యమంత్రి పవన్ సోమవారం రాజమండ్రి ఎయిర్‌పోర్టుకు వచ్చారు. ద్వారకా తిరుమల మండలం ఐఎస్.జగన్నాథపురం లక్ష్మి నరసింహ స్వామిని దర్శించుకునేందుకు పవన్ రాజమండ్రికి చేరుకున్నారు. విమానాశ్రయంలో పవన్‌ను కలిసేందుకు ముఖ్యమంత్రి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్‌గా ఉన్న పెందుర్తి వెంకటేశ్ వర్గీయులు, రాజానగరం టీడీపీ నియోజవర్గ ఇన్‌ఛార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి వర్గీయులు వచ్చారు. అయితే పవన్‌ను కలిసేందుకు పెందుర్తి వర్గీయులను ఎయిర్‌పోర్టు టెర్మినల్‌లోకి పోలీసులు అనుమతించారు. కానీ బొడ్డు వెంకటరమణ వర్గీయులను మాత్రం లోనికి అనుమతించని పరిస్థితి. దీంతో వారు పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. పెందుర్తి వర్గీయులను ఎయిర్‌పోర్టులోకి ఎలా అనుమతించారు?.. వాళ్లకు ప్రోటోకాల్ ఉందా? అని ప్రశ్నించారు. తమను ఎందుకు అనుమతించడం లేదని బొడ్డు వర్గీయులు ఫైర్ అయ్యారు. ఈ పరిస్థితుల్లో పెందుర్తి వర్గానికి చెందిన టీడీపీ నేతలు ఎయిర్‌పోర్టులో నుంచి బయటకు వచ్చారు. దీంతో ఇరు వర్గాలు పరస్పరం వాగ్విదానికి దిగాయి. బూతులు తిట్టుకోవడమే కాకుండా కొట్టుకునే స్థాయికి రెండు వర్గాల నేతలు వెళ్లారు. వెంటనే పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాల నేతలను విడదీయడంతో పరిస్థితి సర్దుమణిగింది.

# సమాజంలో మార్పు తేవడానికే నైతిక విలువలతో కూడిన విద్య

### - మహిళలను గౌరవించేలా పాఠ్యపుస్తకాల్లో మార్పులు తెస్తున్నాం - పెట్టుబడులతోపాటు నైతిక విలువల్లోనూ అగ్రగామిగా నిలుపుతాం
### - తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత విద్యార్థులదే - నైతిక విలువలపై రాష్ట్రస్థాయి విద్యాసదస్సులో మంత్రి లోకేష్

**విజయవాడ, (రాజధాని వార్తలు):** నైతిక విలువల ద్వారా సమాజంలో మార్పు తేవాలని చంద్రబాబు నిర్ణయించారు, ముఖ్యమంత్రి నన్ను పిలిచి సమాజంలో నైతిక విలువలు తీసుకు రావాల్సిన బాధ్యత మనపై ఉందని చెప్పారు. బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుని కేబినెట్ ర్యాంకుతో నియమించారు. ఇది ఒక పవిత్రమైన బాధ్యత అని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య వారి కళాక్షేత్రంలో నైతికవిలువలపై రాష్ట్రస్థాయి విద్యా సదస్సులో విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ సదస్సులో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి వద్ద లైఫ్ లాంగ్ లెర్నర్‌ను నేను. నేను అనేకమంది వ్యక్తులను కలిసినపుడు అంతా కేబినెట్ ర్యాంకు హోదా కావాలని కోరుకునేవారు, అలాంటిది చాగంటికి కేబినెట్ ర్యాంకు ఇచ్చినా కనీసం కప్పు కాఫీ కూడా తాగలేదు. ప్రభుత్వ వాహనం ఉపయోగించలేదు. ఆయన సెల్‌ఫోన్ బిల్లు కూడా ఆయనే చెల్లిస్తున్నారు. అలాంటి గొప్ప వ్యక్తి ద్వారా ఈరోజు నైతిక విలువలపై పుస్తకాలు రూపొందించి మీ భవిష్యత్తు కోసం అందిస్తున్నాం.

**నైతిక విలువల ద్వారానే ఉత్తమ పౌరులు**

మట్టి కుండలా మారుతుంది, శిల శిల్పంలా తయారవుతుంది. చిన్న విత్తనం పెద్ద చెట్టుగా ఎదుగుతుంది. అలాగే బడిలో పిల్లలు చదువుతో పాటు నైతిక విలువలు నేర్చితే సమాజంలో ఆశిస్తున్న మార్పును సాధించగలుగుతాం. అణుశక్తిని బాబులా వాడటం వల్ల హిరోషిమా, నాగసాకీ నగరాల్లో ఎంత వినాశనం జరిగిందో




అందరం చూశాం. అదే అణుశక్తిని విద్యుత్ తయారీకి వాడితే దేశానికి వెలుగు, అభివృద్ధి లభిస్తుంది. అలాగే పిల్లలను సరైన మార్గంలో పెట్టాల్సిన బాధ్యత ఉపాధ్యాయులందరిపైనా ఉంది.

**మహిళలను గౌరవించాలి**

మహిళలను, పెద్దలను గౌరవించాలి. కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా నాకు ఈ నైతిక విలువలు నేర్పారు మా తల్లి భువనమ్మ. నా చిన్ననాటి నుంచీ ఆమె నాకు క్రమశిక్షణ నేర్పించారు. ఆమె ఎప్పుడూ కష్టపడాలి, నీవంతు ప్రజలకు సేవచేయాలని మాత్రమే చెప్పారు. ప్రభుత్వంగా చేయాల్సింది మేం చేస్తాం. చాగంటి గారి లాంటి గొప్ప వ్యక్తులతో పుస్తకాలు రూపొందిస్తాం. కానీ అది సరిపోదు. మార్పు మన ఇంటినుంచే మొదలు కావాలి. తల్లిదండ్రులుగా మనపై ఉన్న పెద్ద బాధ్యత ఇది. తెలుగుభాషలో కొన్ని వాడుక పదాలు ఉన్నాయి. గాజులు తొడుక్కున్నావా, చీర కట్టుకున్నావా, అడపిల్లలా ఏడవొద్దు అని ఎవరైనా తక్కువగా మాట్లాడితే నాకు చాలా బాధ కలిగేది. అలాంటి మాటలకు పూర్తిగా ఫుల్ స్టాప్ పెట్టాలి. అలాంటి మాటలు ఎవరు మాట్లాడినా మా లోకేష్ అన్నకు చెబుతామని చెప్పండి. మహిళలను గౌరవించినపుడే సమాజం బాగుపడుతుంది.. సినిమాల్లో, వెబ్ సీరీస్‌ల్లో మహిళలను అవమానించే డైలాగులు, సన్నివేశాలు ఉండకూడదు అని సిఎం, ఉప ముఖ్యమంత్రి గారితో చర్చించాను.

**సమాజంలో మార్పు కోరుకుంటున్నా**

నేను విద్యాశాఖ మంత్రిగా బాధ్యత చేపట్టిన తర్వాత పాఠ్య పుస్తకాలు పరిశీలించాను. అందులో ఇంటి పనులు చేస్తున్న ఫోటోలన్నీ మహిళలవే కనిపించాయి. వెంటనే అధికారులకు ఆదేశాలు ఇచ్చి, 50-50గా మార్పు చేశాము. పనులు చేస్తున్న మగవారి ఫోటోలు కూడా 50 శాతం పెట్టాం. ఇంటి పనులు కూడా ఇద్దరూ సమానంగా చేయాల్సి ఉంది. నేను అమెరికాలో చదుకునేటప్పుడు నా భార్య బ్రాహ్మణి నేను ఇంటి పనులు చెరోసగం చేసేవాళ్లం. మాకు ఎలాంటి భేషజం లేదు. అలాంటి మార్పు సమాజంలో రావాలని బలంగా నమ్ముతున్నా. యువగళం పాదయాత్రలో ఒక చిన్న పిల్లవాడు పసుపు రంగు టీ షర్ట్ వేసుకుని వస్తే నాకు బాధ కలిగింది. చిన్నవయసులో పార్టీ రంగులు వద్దని వారించాను. పిల్లల్లో నాకు దేవుడు కన్పిస్తాడు. చంద్రగిరి నియోజకవర్గంలో యువగళం పాదయాత్ర చేస్తున్నపుడు ఒక తల్లి నన్ను కలసి తన బాధ చెప్పుకుంది. ఆమెకు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. ఆమె పెద్ద కుమార్తెను గంజాయికి బానిస చేసి 30రోజులు వాడుకున్నారు. రాయవెల్లూరు సిఎంసి "De-addiction కేంద్రానికి పంపడానికి మీరు సహాయం చేయండి అని అడిగింది. అందుకే ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత డ్రగ్స్‌పై యుద్ధం ప్రకటించాం. దీనిని సీరియస్‌గా తీసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది.

**విద్యాశాఖను ఛాలెంజ్‌గా స్వీకరించా**

నేను విద్యాశాఖ బాధ్యత తీసుకుంటున్నానని అన్న వెంటనే చాలామంది "కఠినమైన శాఖ నీకు ఈ చాలెంజ్ అవసరమా? టీచర్ యూనియన్లు, స్టూడెంట్ యూనియన్లు ఉంటాయి అని అన్నారు. కానీ జీవితమే ఒక ఛాలెంజ్. మార్కులు తక్కువ వచ్చాయని, తల్లిదండ్రులు మందలించారని పిల్లలు ఆత్మహత్యలు చేసుకోవడం బాధ కలిగిస్తోంది. 2019 ఎన్నికల్లో నేను మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి 5300 ఓట్ల తేడాతో ఓడిపోయాను. ఒక్కరోజు బాధ, ఆవేదన కలిగింది. రెండో రోజు నుంచి ఆ అపజయం నాలో కసి పెంచింది. అయిదేళ్లు కష్టపడి వారి మనసు గెలవాలని నిర్ణించుకుని ప్రజల్లోకి వెళ్లాను. అనేకమంది అవమానించినా వెనుకడుగు వేయలేదు. ఒక లక్ష్యం పెట్టుకుని పనిచేస్తే సాధించే శక్తి దేవుడు మనకు ఇస్తాడు. 2024 ఎన్నికల్లో తిరిగి అదే నియోజకవర్గంలో నేను 91వేల మెజారిటీతో గెలుపొందాను. అదే స్ఫూర్తితో విద్యాశాఖ మంత్రిగా బాధ్యత స్వీకరించాను. తరతరాలుగా టీచర్లు ఎదుర్కొంటున్నా సమస్యలను పరిష్కరించా. టీచర్ ట్రాన్స్‌ఫర్ యాక్ట్ తెచ్చాను. 9,600 పాఠశాలల్లో వన్ క్లాస్ వన్ టీచర్ విధానాన్ని తీసుకువచ్చాను. ఒక్క లిటిగేషన్ లేకుండా కేవలం 150 రోజుల్లో మెగా డిఎస్సీ ద్వారా 16,347 టీచర్ (మిగతా 2వ పేజీలో)

# ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్

## - ఘనంగా సర్దార్ @150 యూనిటీ మార్చ్" ర్యాలీ











**భీమవరం, (రాజధాని వార్తలు):** ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల సహాయక మంత్రి మెంబర్ అఫ్ పార్లమెంట్ నరసాపురం భూపతిరాజు శ్రీనివాస్ వర్మ అన్నారు. మై భారత్ (నెహ్రూ యువ కేంద్ర) పశ్చిమ గోదావరి జిల్లా ఆధ్వర్యంలో సోమవారం"సర్దార్ @150 యూనిటీ మార్చ్" ర్యాలీలో కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల సహాయక మంత్రి మెంబర్ అఫ్ పార్లమెంట్ నరసాపురం భూపతిరాజు శ్రీనివాస్ వర్మ పటేల్ 150వ జయంతి మాసోత్సవాలు సందర్భంగా రాష్ట్రీయ ఏక్తా దివాస్ (జాతీయ సమైక్య దినోత్సవం)లో భాగంగా ర్యాలీని దంతులూరి నారాయణరాజు కాలేజ్ నుండి నుండి భీమవరం పాత బస్టాండ్ వరకు పెద్ద ఎత్తున సాగింది. ఈ ర్యాలీలో మెంబర్ అఫ్ పార్లమెంట్ నరసాపురం కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి ర్యాలీ చివరి వరకు పాదయాత్ర చేశారు కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల సహాయక మంత్రి మెంబర్ అఫ్ పార్లమెంట్ నరసాపురం భూపతి రాజు శ్రీనివాస్ వర్మ దంతులూరి నారాయణ రాజు కాలేజ్ రామకృష్ణ సభ ప్రాంగణంలో జరిగిన మీటింగ్లో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పేరు స్వర్ణాక్షరాలతో లిఖించవచ్చని అన్నారు. వల్లభాయ్ పటేల్‌ను ఐరన్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా కీర్తించడం జరిగిందని చెప్పారు. భారత స్వాతంత్ర్య సమరయోధుడిగానే కాకుండా, స్వాతంత్ర్యం అనంతరం దేశ ఐక్యతను సాధించిన మహానేతగా ఆయనకు చరిత్రలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. మై భారత్ పశ్చిమ గోదావరి జిల్లా యువ అధికారి సుంకర రాము మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ కేవలం నాయకుడే కాదని, దేశ ఐక్యతకు చిహ్నం అన్నారు. ధైర్యం, దేశభక్తికి ప్రతీక అని, ఆయన త్యాగం, కర్తవ్య నిబద్ధత, దృఢ సంకల్పం భారత యువతకు ప్రేరణ అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షురాలు ఏ శ్రీదేవి, బిజెపి డిస్టిక్ జనరల్ సెక్రెటరీ కే వినోద్ కుమార్ వర్మ డిఎన్ఆర్ కాలేజ్ వైస్ ప్రెసిడెంట్ పాండురంగరాజు ఎస్ ఆర్ కె కాలేజ్ ఎన్ఎస్ఎస్ పిఓ మరియు డిఎన్ఆర్ ఇంజనీరింగ్ ఆర్ట్స్ కాలేజ్ కాలేజ్ ఎన్ ఎస్ఎస్‌పిఓలు యువత పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రామిక చట్టాలకు నూతన శకం : కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

(మొదటి పేజీ తరువాయి)

చేయడం వంటి ప్రధాన సంస్కరణలు ఉన్నాయి. ఈ నాలుగు స్మృతులతో ఉపాధిని సంఘటితం చేయడం, కార్మికుల సంరక్షణను బలోపేతం చేయడం, కార్మిక నిర్వహణ వ్యవస్థను సులభతరం, సురక్షితం చేయడంతో పాటు అంతర్జాతీయంగా అనుసంధానించవచ్చు. మనదేశంలో 1930- 50 మధ్య రూపొందించిన కార్మిక చట్టాలే నేటికి అమలులో ఉన్నాయి. సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న భారతదేశంలో ప్రస్తుత తరానికి ఆ చట్టాలు సరిపోవనే ఆందోళనలు ఉన్న సంగతి విదితమే. దశాబ్ధాల నాటి పరిస్థితులకు అనుగుణంగా రూపొందించిన చట్టాలను అమలు చేయడం వల్ల ప్రస్తుత పరిస్థితుల్లో వ్యాపారాలు, ఫ్యాక్టరీలకు కష్టంగా మారింది. అలాగే కార్మికులకు సరైన భద్రత, సంక్షేమం అందడం లేదనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో ఈ సమస్యలను అధిగమించేందుకు నూతన కార్మిక కోడ్‌లను కేంద్రం రూపొందించడం ద్వారా కార్మికులకు ఎంతో మేలు చేసింది. ఇప్పటి వరకు అమల్లో ఉన్న కార్మిక చట్టాలను సమీక్షించిన కేంద్ర ప్రభుత్వం తాజాగా నాలుగు కొత్త లేబర్ కోడ్లను ప్రకటించింది. వేతనాల కోడ్- 2019, సామాజిక భద్రతా కోడ్- 2020, పారిశ్రామిక సంబం ధాల కోడ్- 2020, వృత్తి భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్- 2020 ఇందులో ఉన్నాయి. ఇవి ఈ నెల 21 నుంచి అమల్లోకి వచ్చాయి. ఇప్పటి వరకు అమల్లో ఉన్న కార్మిక చట్టాలను సమీక్షించిన కేంద్ర ప్రభుత్వం తాజాగా నాలుగు కొత్త లేబర్ కోడ్లను ప్రకటించింది. వేతనాల కోడ్- 2019, సామాజిక భద్రతా కోడ్- 2020, పారిశ్రామిక సంబంధాల కోడ్- 2020, వృత్తి భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్- 2020 ఇందులో ఉన్నాయి. ఇవి ఈ నెల 21 నుంచి అమల్లోకి వచ్చాయి. ఇవి అన్ని రంగాలకూ వర్తించనున్నాయని...కార్మికుల భద్రత మెరుగు పర్చడానికి, అలసటను తగ్గించడానికే కాక భద్రత, అదనపు ప్రయోజనాలు లభిస్తాయి అని చెబుతున్నారు. దీంతో ఇప్పటి వరకు అమల్లో ఉన్న 29 కార్మిక చట్టాలను హేతుబద్ధం చేసినట్లు అవుతుందని కేంద్ర ప్రభుతం చెబుతోంది. దీని ద్వారా మెరుగైన కార్మిక, ఉద్యోగ విధానాలు అమలల్లోకి రానున్నాయి.

**కార్మికులకు వెసులుబాటు..**

కొత్త కార్మిక నియమావళి ప్రకారం అతిపెద్ద మార్పులలో ఒకటి రోజువారీ పని పరిస్థితులు , ఉద్యోగులు ఎంతకాలం పని చేస్తారు, వారు ఎప్పుడు వేతనంతో కూడిన సెలవులకు అర్హులు, వారు ఎంత ఓవర్ టైం తీసుకోవచ్చు,వారు ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలకు అర్హులు లాంటివి నిర్ణయిస్తుంది. ఇప్పటివరకు, ఉద్యోగులు వార్షిక వేతనంతో కూడిన సెలవుకు అర్హత సాధించడానికి ముందు ఒక క్యాలెండర్ సంవత్సరంలో 240 పని దినాలను పూర్తి చేయాల్సి ఉండేది. కొత్త కోడ్‌లు ఆ అవసరాన్ని 180 రోజులకు తగ్గించాయి. అంటే ఇప్పుడు ఒక కార్మికుడు ఏడాదిలో చాలా ముందుగానే సెలవుకు అర్హుడు అవుతాడు. ఇది తయారీ, వస్త్రాలు, రిటైల్, నిర్మాణం,హాజరు నియమాలు సాంప్రదాయకంగా కఠినంగా ఉండే ఇతర రంగాలలోని వారికి పెద్ద మార్పు అని చెప్పవచ్చు. దీని వలన కార్మికులకు మరింత విశ్రాంతి దొరుకుతుంది. ఇది దీర్ఘకాలంలో ఉత్పాదకతతో పాటూ ఉద్యోగ సంతృప్తిని మెరుగుపరుస్తుంది. కొత్త కోడ్‌ల ప్రకారం రోజుకు ఎనిమిది గంటలు, వారానికి 48 గంటలు పని చేయాలనే నియమం అలానే ఉంటుంది. కానీ వాటిని ఎలా ఏర్పాటు చేసేకో వచ్చనేది మాత్రం మారుతుంది. దీనిని వారంలో నాలుగు రోజులు 12 గంటలు, ఐదు రోజులు వారాంలో దాదాపు 9.5 గంటలు, ఆరు రోజులు వారంలో రోజుకు ఎనిమిది గంటలు కింద విభజించుకోవచ్చును. దీంతో పాటూ ఓవర్ టైమ్ పరిమితిని స్థానిక అవసరాల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వాలు తమ స్వంత పరిమితులను నిర్ణయించుకోవచ్చు. కొత్త కోడ్‌లలో మరో ప్రధాన మార్పు..ఆరోగ్యం, వైద్య కవరేజ్. 40 ఏళ్లు పైబడిన ప్రతి ఉద్యోగికి ఇప్పుడు ఉచిత వార్షిక ఆరోగ్య తనిఖీ లభిస్తుంది. ముఖ్యంగా ఎక్కువ గంటలు, ప్రమాదకర వాతావరణాలు లేదా శారీరక ఒత్తిడి సాధారణంగా ఉండే రంగాలలో, నివారణ ఆరోగ్య సంరక్షణ వైపు విస్తృత ప్రయత్నంలో ఇది భాగంగా ఉంటుంది. ముఖ్యంగా, తోటల కార్మికులకు ఇప్పుడు గతంలో ఒకే విధంగా అందుబాటులో లేని ESIC వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. ఈ నిబంధన కార్మికులకు అనుకూలంగా ఎన్డీయే ప్రభుత్వం

ఈ కోడ్‌లను రూపొందించింది. ప్రతి కార్మికుడికీ గౌరవం కల్పించాలన్నది ఎన్డీయే సర్కారు హామీతో కొత్త కార్మిక స్మృతులు దేశంలో అమల్లోకి వచ్చాయి" ఈ కోడ్‌లతో కార్మికులం దరికీ కనీస వేతనాలు లభిస్తాయి, యువతకు నియామక పత్రాలు అందుతాయి, మహిళలకు సమాన వేతనాలు, గౌరవం లభిస్తుంది, 40 కోట్ల మంది కార్మికులకు సామాజిక భద్రత లభిస్తుంది, ఫిక్స్‌డ్ టెర్మ్ ఉద్యోగులకు ఏడాది పనిచేసిన తర్వాత గ్రాట్యుటీ వంటివి దక్కుతాయి."ఈ సంస్కరణలు సాధారణ మార్పులు కాదు. కార్మికుల సంక్షేమం కోసం ఎన్డీయే ప్రభుత్వం తీసుకున్న అతిపెద్ద చర్య. స్వయం సమృద్ధ భారత్ దిశగా కీలక ముందడుగు. 2047కల్లా అభివృద్ధి చెందిన భారత్‌గా నిలవాలన్న లక్ష్యానికి ఊతం" అని చెప్పడంలో సందేహం లేదు.



# - అంధుల మహిళా టీ20 వరల్డ్ కప్‌లో భారత్ గెలుపుపై హర్షం వ్యక్తం చేసిన మంత్రి మండిపల్లి మంత్రి రాంప్రసాద్ రెడ్డి

**(రాజధాని వార్తలు):** ఫైనల్‌లో నేపాల్‌పై అద్భుత విజయంతో జయకేతనం ఎగుర వేసిన టీం ఇండియాకు శుభాకాంక్షలు. మహిళల అసాధారణ ప్రతిభ దేశానికి గర్వకారణం నిలిచింది. ప్రతికూలతలను జయించి చరిత్ర సృష్టించిన భారత మహిళా జట్టు పోరాట పటిమ, సామర్థ్యం అందరికి ఆదర్శం.. మంత్రి రాంప్రసాద్ రెడ్డి. క్రీడల్లో సమాన అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉంది – మంత్రి స్పందన. అంధుల మహిళల టీ20 ప్రపంచ కప్ విజయం యువతకు స్ఫూర్తి, క్రీడల్లో దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటారు. రాష్ట్ర ప్రభుత్వం పారా గేమ్స్‌తో పాటు Deaf, Blind స్పోర్ట్స్‌ను మరింత ప్రోత్సహించేందుకు శ్రద్ధ వహిస్తుంది.

# ప్రత్తిపాడు నియోజకవర్గం అభివృద్ధిలో ఎమ్మెల్యే రామాంజనేయులు



**అమరావతి, (రాజధాని వార్తలు):** ప్రత్తిపాడు తెలుగు మహిళా నాయకురాలు యడ్లపల్లి వాణి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుదుని పలు అంశాల గురించి నియోజకవర్గ మహిళా నాయకురాలు వాణి కలిశారు. ప్రత్తిపాడు నియోజకవర్గం అభివృద్ధిలో ఎమ్మెల్యే రామాంజనేయులు శక్తివంచన లేకుండా పనిచేస్తున్నారని ఈఎస్ఐ హాస్పటల్ నియోజవర్గంకి తీసుకురావడం, మొంథా తుఫాన్ వల్ల నష్టపోయిన పత్తి రైతులకు అండగా సిసీఐ, కాటన్ కార్పొరేషన్ ద్వారా ప్రతి రైతు దగ్గర పత్తిని మద్దతు ధరకి కొనుగోలు చేయించడం. ప్రతి శుక్రవారం కార్యాలయంలో ప్రజా పరిష్కార వేదిక ద్వారా నియోజకవర్గంలో ప్రజల సమస్యలు, పరిష్కారం చేయటం. ప్రభుత్వం అమలు చేసే సూపర్ సిక్స్ పథకాలను కూడా అమలు చేయడంలో ఎమ్మెల్యే రామాంజనేయులు పనితీరు బాగుందని ఆమె సీఎంకి తెలిపారు. అందుకు సీఎం గుడ్ బాగా పని చేస్తున్నారని రానున్న స్థానిక ఎన్నికల్లో కూడా నియోజవర్గంలో అందరూ కలిసికట్టుగా పనిచేసి మంచి గెలుపు ఇవ్వాలని చెప్పారు.

# ఆరోగ్యాంధ్ర సాకారానికి 10 మంది అంతర్జాతీయ నిపుణులతో ఉన్నత స్థాయి కమిటీ

## - సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపకల్పన లక్ష్యం

## - డిసెంబరులో ముఖ్యమంత్రి అధ్యక్షతన కమిటీ మొదటి సమావేశం

**(రాజధాని వార్తలు):** బహుముఖ వ్యూహాలతో ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా జరుగుతున్న ప్రయత్నాలను సమీక్షించి, సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించడానికి రాష్ట్రప్రభుత్వం 10 మంది ప్రముఖ అంతర్జాతీయ నిపుణులతో ఉన్నతస్థాయి సలహా మండలిని నియమించింది. ఈ మేరకు తగు చర్చల అనంతరం వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రతిపాదనను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం ఆమోదించారు. రాష్ట్ర ప్రజలకు సంపూర్ణ ఆరోగ్య రక్షణ లక్ష్యంగా...2047 నాటికి ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనకు ముఖ్యమంత్రి విజన్ డాక్యుమెంట్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈదిశగా ఇప్పటికే ప్రయత్నాలు మొదలయ్యాయి. అత్యధికంగా ప్రజల అనారోగ్యానికి కారణమవుతున్న 10 వ్యాధులకు సంబంధించి ఒక్కో వ్యాధికి అడ్వయిజరీ గ్రూపు ఏర్పాటు చేశారు. వ్యాధుల వారీగా ప్రణాళికలను రూపొందించి ఆయా వ్యాధుల భారాన్ని తగ్గించడానికి కృషి జరుగుతోంది. ఆధునిక సాంకేతికతో మెరుగైన వైద్య సేవల్ని అందించడానికి గేట్స్ ఫౌండేషన్, టాటా ఎండి, ఐఐటి చెన్నై మరియు స్వస్థి వంటి సంస్థల భాగస్వామ్యంతో పలు ప్రణాళికలు అమలవుతున్నాయి. వీటితో పాటు పలు ఇతర కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత ఆరోగ్య పథకాలు నడుస్తున్నాయి. ఈ ప్రణాళికల అమలు, ఫలితాలను సమీక్షిస్తూ ఆరోగ్యాంధ్ర సాధన దిశగా ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించడానికి 10 మందితో కూడిన ఉన్నతస్థాయి నిపుణుల సలహా మండలి ఏర్పాటుకు ముఖ్యమంత్రి అంగీకరించారు.

**నిపుణుల సలహా మండలి బాధ్యతలు**

ప్రపంచ వ్యాప్త విధానాలు మరియు అనుభవాలు, సాంకేతిక నైపుణ్యం, వ్యూహ రచనల మేళవింపుతో రాష్ట్రాన్ని ఆరోగ్య రంగంలో అగ్ర స్థానంలో నిలపడానికి సలహా మండలి చేపట్టాల్సిన బాధ్యతలను ప్రభుత్వం ఈ క్రింది విధంగా స్పష్టంగా పేర్కొంది. 1) స్వర్ణాంధ్ర విజన్-2047 మేరకు రాష్ట్ర ప్రజలకు పూర్తి ఆరోగ్యం మరియు ఆహ్లాదం కల్పించేందుకు సమగ్ర ప్రణాళిక రూపకల్పన. 2) మాతాశిశు ఆరోగ్య పరిరక్షణ మరియు అసంక్రమిక(ఎన్సీడీ) వ్యాధుల నిర్మూలనకు అవసరమైన సృజనాత్మకత (ఇన్నొవేషన్)తో కూడిన, విస్తృత స్థాయిలో అమలు చేయగలిగిన మార్గాలను సూచించడం. 3) వివిధ పథకాల పటిష్ట సమన్వయం కోసం సాంకేతికత ఆధారంగా లక్ష్యంగా చేపట్టాల్సిన చర్యల్ని సూచించడం. 4) రాష్ట్రాన్ని జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో గ్లోబల్ హెల్త్ హబ్‌గా రూపొందించడం.

**వచ్చే నెలలో మొదటి సమావేశం**

డిసెంబరు మధ్యలో ఈ ఉన్నత స్థాయి అంతర్జాతీయ నిపుణుల సలహా మండలి మొదటి సమావేశం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో జరగనుంది. ఈ సమావేశంలో ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యానికి సంబంధించి వివిధ అంశాలపై విస్తృత చర్చలు జరుగుతాయి. సలహా మండలి ఏడాదిలో కనీసం రెండు సార్లు సమావేశం కావాల్సి ఉంటుంది. అవసరాల మేరకు అదనపు సమావేశాలు నిర్వహించుకోవచ్చు.

**సలహా మండలి సభ్యులు**

1. సర్ పీటర్ పయట్, యుఎన్ ఎయిడ్స్ వ్యవస్థాపక ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ 2. డాక్టర్ సౌమ్య స్వామినాధన్, డబ్ల్యుహెచ్ఓ మాజీ ప్రధాన శాస్త్రవేత్త 3. ప్రొఫెసర్ ఇక్ ఇంగ్ టేవ్, డీన్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, సింగపూర్ విశ్వవిద్యాలయం 4. డాక్టర్ గగన్ దీప్ ఖాన్, డైరెక్టర్, బిల్ అండ్ మిలిండా గేట్స్ ఫౌండేషన్ 5. డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, ఛైర్మన్, ఎఐజి హాస్పిట్ హైదరాబాద్ 6. ప్రొఫెసర్ మార్గరెట్ ఎలిజిబెత్ క్రుక్, హార్వర్డ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ 7. డాక్టర్ నిఖిల్ టాండన్, ప్రొఫెసర్ ఎయిమ్స్ న్యూఢిల్లీ 8. శ్రీ రిజ్వాన్ కొయిట, ఛైర్మన్ నేషన్ ఎక్రెడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పటల్స్ (ఎన్ఎబిహెచ్) 9. శ్రీ శ్రీకాంత్ నాదముని, ఖోస్ల ల్యాబ్స్ వ్యవస్థాపకులు 10. మిస్ ఆర్తి అహుజా, ఐఎఎస్, కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి.

# సమాజంలో మార్పు తేవడానికే నైతిక విలువలతో కూడిన విద్య

(మొదటి పేజీ తరువాయి)

పోస్టులను భర్తీ చేశాం.

**తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టండి**

కేజి నుంచి పిజి వరకు కరిక్యులమ్ ప్రక్షాళన చేస్తున్నాం. అందులో ఇప్పటికే తొలి అడుగు వేశాం. పిల్లలకు అందించే బ్యాగులు, పుస్తకాలు, బెల్ట్‌లపై రాజకీయపరమైన ఆనవాళ్లు లేకుండా చేశాం. వాటిపై ఎక్కడా మంత్రి, ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి ఫోటోలు లేవు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో విద్యార్థులకు కిట్స్ అందించాం. డొక్కా సీతమ్మ పేరుతో మధ్యాహ్న భోజనం అందిస్తున్నాం. ప్రతి శనివారాన్ని నో బ్యాగ్ డేగా ప్రకటించాం. మేము బాధ్యత గల ప్రభుత్వంగా పనిచేస్తున్నాం. ఎంతోమంది మహనీయులు ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉన్నతస్థానాలకు చేరుకున్నారు. మీ అందరిలో ఆ శక్తి ఉంది. తల్లిదండ్రులు ఎంతో త్యాగం చేసి ప్రతిరూపాయి మీకోసం ఖర్చుపెడుతున్నారు. వారు మీపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మీపై ఉంది. సమాజంలో నైతిక విలువలు చాలా అవసరం. పుట్టపర్తిలో సత్యసాయి బాబా జయంతి సందర్భంగా కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి సహా ఎంతోమంది ప్రముఖులు హాజరయ్యారు. కార్యక్రమం పూర్తయ్యాక అక్కడి విద్యార్థులంతా నిలబడి ఎవరి బాటిల్, గ్లాస్ తీసుకుని చిన్న పేపర్ కూడా లేకుండా చెత్తబుట్టలో వేశారు. అలాంటి మార్పు మనందరిలో రావాలి. అప్పుడే ఆశించిన సమాజాన్ని సాధించుకోగలం.

**మాకు చాగంటి దిశానిర్దేశం చేయాలి**

మాకు మార్గదర్శకత్వం ఇచ్చి నడిపించాల్సిన బాధ్యత చాగంటిపై ఉంది. 42 ఏళ్ల వయసులో నేను విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టాను. దీనిని ప్రజలు నాపై పెట్టిన పవిత్రమైన బాధ్యతగా భావిస్తున్నా. మీ డైరక్షన్‌లో పనిచేయడానికి విద్యాశాఖ యంత్రాంగ యావత్తు సిద్ధంగా ఉంది. ఇలాంటి కార్యక్రమాలను అన్ని జిల్లాలు, పార్లమెంటు నియోజకవర్గాలు, అసెంబ్లీ కేంద్రాల్లో నిర్వహించాలన్నది నా ఆలోచన. కేవలం ఉపాధ్యాయులు, పిల్లలతోనే కాకుండా ప్రజలను కూడా భాగస్వాములను చేసి చైతన్యం తీసుకురావాలి..

ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల సాధనలో నెం.1గా చేయా లని మేమంతా తపనతో పనిచేస్తున్నాం. నైతిక విలువలు కూడా ఉన్నపుడు ఎపి అన్ని రంగాల్లో అగ్రగామిగా తయారవుతుంది, అందుకు మీరు మాకు మార్గదర్శకత్వం వహించాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు, ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు, విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరక్టర్ బి.శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా తదితరులు పాల్గొన్నారు.


# విజయనగరం విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రెవిన్యూ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు, ఏపిజేఏసి అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు





**విజయనగరం, (రాజధాని వార్తలు):** స్థానిక రెవెన్యూ హెూమ్ నందు సాయంత్రం 5.00 గంటలకు జిల్లాలోని ఏపీ జేఏసీ అమరావతిలో ఉన్న అన్ని సభ్య సంఘాల నాయకులతో ఒక సమావేశం ఏర్పాటు చేసి, అన్ని శాఖాపరమైన సంఘాల నాయ కులు, ఉ ద్యోగులు ఐకమత్యంతో కలిసి ఉండాలని, సమస్యల పరిష్కారం, హక్కుల సాధనే ప్రధాన ధ్యేయంగా ఏపిజేఏసి పని చేస్తుందని తెలిపారు. గౌ. ముఖ్యమంత్రివర్యులు సమస్యల పరి ష్కారంనకు సానుకూలంగా ఉన్నారని తెలిపారు. ఉద్యోగులకు వున్న బకాయిల సాధనకు కృషి చేస్తున్నామన్నారు. ఏపిజేఏసి సాధించిన విజయాలను అందరికీ తెలియజేశారు. ఈ సందర్భ ములో రెవిన్యూ సంఘం నాయకులు, రెవెన్యూ ఉద్యోగులు మరియు జిల్లాలో ఉన్న జేఏసీ భాగస్వామ్య సంఘాల నాయకులు హాజరైనారు.

# భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి - జిల్లా స్థాయి సభ





**భద్రాచలం, (రాజధాని వార్తలు):** భద్రాచలం విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర బీజేపీ ఎస్టీ మోర్చా అధ్యక్షులు నేనావత్ రవి నాయక్ ముందుగా భద్రాచలం సీతారామచంద్ర స్వామిని దర్శించుకుని, భగవాన్ బిర్సా ముండా జయంతి కార్యక్రమం విజయవంతం కావాలని అభిలషించారు. భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సభను బూర్గంపాడు మండలం, సారపాక తాళ్లగొమ్మూరులోని సత్యనారాయణ స్వామి ఫంక్షన్ హాల్‌లో ఉదయం ఘనంగా నిర్వహించారు. ఈ సభకు రవి నాయక్, బీజేపీ జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల బీజేపీ ఎస్టీ మోర్చా నాయకులు, కార్యకర్తలు, గిరిజన సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవి నాయక్ మాట్లాడుతూ, "భగవాన్ బిర్సా ముండా ఆదివాసీ గౌరవం, భూమి హక్కుల కోసం చేసిన 'ఉల్గులాన్' ఉద్యమం భారత చరిత్రలో మైలురాయి. 'ధరతి అబా'గా నిలిచిన ఆయన జీవితం, త్యాగాలు దేశవ్యాప్తంగా ఆదివాసీ సమాజానికి ప్రేరణ. బిర్సా ముండా పేరుతో బీజేపీ ప్రభుత్వం అనేక గిరిజన సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది," అని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా భద్రాచలం, పినపాక ప్రాంతాల ఆదివాసీ నాయకులను ప్రత్యేకంగా సన్మానించారు. కార్యక్రమ వక్తలు బిర్సా ముండా పోరాట స్ఫూర్తి, ఆదివాసీ హక్కుల రక్షణ, భూమి సంరక్షణ ఉద్యమాల ప్రాధాన్యతను వివరించారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు రంగా కిరణ్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కుంజా ధర్మా, జిల్లా నాయకులు బిక్షపతి, బీజేపీ రాష్ట్ర సభ్యులు పోడియం బాలరాజు, బీజేపీ తెలంగాణ ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కుంజా సంతోష్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిలాల్, రాష్ట్ర ప్రతినిధి భాస్కర్, రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్ విశాల్ నాయక్, ఎనుగుల వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కిడ్నీ బాధిత కుటుంబానికి జీవనోపాధి కల్పించిన రీచ్ గ్లోబల్ ఫౌండేషన్

## - డాక్టర్ రమేష్ నాథ్ లింగుట్ల దాతృత్వం ప్రశంసనీయం




**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తిలోని తెలుగుగంగ కాలనీ లో నివసిస్తున్న రేవతి కుటుంబం గత కొంతకాలంగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. రేవతి భర్త మధు రెండు కిడ్నీలు పూర్తిగా పనిచేయకుండా మంచాన పడిపోవడంతో కుటుంబం జీవనోపాధి కోల్పోయి పిల్లలను కూడా పోషించలేని పరిస్థితి ఏర్పడింది. ఈ విషయం తిరుపతి జిల్లా పంచాయితీ అధికారి శ్రీమతి సుశీలాదేవి ద్వారా తెలుసుకున్న రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రమేష్ నాథ్ లింగుట్ల వెంటనే స్పందించి ఆ కుటుంబానికి తోడుగా నిలిచారు. జీవనోపాధిగా నిలిచే విధంగా ఇడ్లీ అంగడి ప్రారంభించేందుకు కావలసిన స్టవ్, ఇడ్లీ వంట సామాగ్రి, దోశల పెనం,నెలరోజులకు అంగడికి సరిపడిన పప్పులు,బియ్యం,మసాలా దినుసులు తదితర సామాగ్రి తన ప్రతినిధుల ద్వారా అందజేశారు. సహాయం అందుకున్న రేవతి. కుటుంబం సుశీలా దేవి, దాత రమేష్ నాథ్ లింగుట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ప్రతినిధులు డాక్టర్ మొర్రిమేకల దేవరాజులు, సమగ్ర శిక్ష జిల్లా అధికారి డాక్టర్ సుధాకర్ నాయుడు, ఫిజికల్ డైరెక్టర్ గోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# స్పెషల్ గ్రామసభ.. సర్పంచి ఆనం ప్రసాద్ రెడ్డి





**సంగం, (రాజధాని వార్తలు):** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్పెషల్ గ్రామసభ నిర్వహించినట్లు సర్పంచ్ ఆనం ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.

కమీషనర్ పంచాయతీ రాజ్ ఆదేశాల మేరకు సంగం మండలం వెంగారెడ్డిపాలెం గ్రామ పంచాయితీ నందు గ్రామ సర్పంచ్ అయిన ఆనం ప్రసాద్ రెడ్డి అధ్యక్షతన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్పెషల్ గ్రామ సభ నిర్వహించడం జరిగింది. ఈ గ్రామ సభ నందు సర్పంచ్ ఆనం ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ. గ్రామ పంచాయతీ నందు జాబ్ కార్డ్స్ యొక్క ఈకెవైసిను 90% పూర్తిచేయడం జరిగినది మిగిలిన 10% పూర్తిచేయాలని కోరారు.

గ్రామపంచాయతీ నందు 41 మరణించిన జాబ్ కార్డ్స్ తొలగింపు జాబితాను చదివి వినిపించడం జరిగింది ఇందులో ఏమైనా అభ్యంతరములను తెలుపమన్నారు. మరియు నూతన జాబ్ కార్డ్సుకు అర్హులు ఎవరైనా ఉంటే నమోదు చేసుకోవాలని కోరారు. ఈ గ్రామ సభ నందు పంచాయతీ కార్యదర్శి ఉదయ్ కుమార్ మరియు రవీంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్ నరేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో భారీ శుభ్రత కార్యక్రమం










**నెల్లూరు, (రాజధాని వార్తలు):** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం, నెల్లూరు నేషనల్ సర్వీస్ స్కీమ్ సెల్ ఆధ్వర్యంలో భారీ శుభ్రత కార్యక్రమం నెల్లూరు నగరంలోని ప్రముఖ ప్రదేశాలలో విజయవంతంగా నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమం భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు మరియు క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో స్పాన్సర్ చేయబడింది. ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం ప్రజా పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ మరియు సామాజిక బాధ్యత పట్ల యువతలో అవగాహన పెంపొందించడం. కార్యక్రమానికి గూడూరుకు చెందిన ప్రముఖ సామాజిక పారిశ్రామికవేత్త కోట సునీల్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడిన ఆయన, తన విద్యార్థి దశలోని అనుభవాలను పంచుకుంటూ పరిశుభ్రత, వృక్షారోపణ మరియు పర్యావరణ సంరక్షణ యొక్క ప్రాధాన్యతను విశదీకరించారు. తల్లిదండ్రుల పట్ల మరియు భూమాత పట్ల బాధ్యతగా ఉండాలని, ఎన్ఎస్ఎస్ ఒక విద్యార్థి వ్యక్తిత్వ వికాసానికి కీలకమని విద్యార్థులను ప్రేరేపించారు. నేషనల్ సర్వీస్ స్కీమ్ రీజినల్ డైరెక్టరేట్, హైదరాబాద్ యువ అధికారి సైదా రామవత్ నాయిక్ ఎన్ఎస్ఎస్ యొక్క లక్ష్యాలు, కార్యక్రమాలు మరియు వాలంటీర్లకు లభించే అవకాశాల గురించి వివరించారు. కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించడం మరియు ఉన్నత ప్రమాణాలతో డాక్యుమెంటేషన్ చేయడంలో ఎన్ఎస్ఎస్ సెల్ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. ఉదయ సంకర్ అల్లం శుభ్రత కార్యక్రమం లక్ష్యాలను వివరించారు. డా. కె.సునీత, రిజిస్ట్రార్ (ఇన్‌చార్జ్), ఆచార్య సిహెచ్.విజయ, ప్రిన్సిపాల్, విఎస్‌యు కాలేజ్, మరియు ఎ.మహేంద్ర రెడ్డి, డిస్ట్రిక్ట్ యువ అధికారి, మై భారత కేంద్రం, నెల్లూరు కూడా విద్యార్థులను సామాజిక బాధ్యత మరియు సమాజాభివృద్ధిలో చురుకైన పాత్ర వహించమని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో విఎస్‌యు కాలేజ్, డికె డిగ్రీ & జూనియర్ కాలేజీలు, ఆదిత్య డిగ్రీ కాలేజ్, కృష్ణ చైతన్య, రావ్స్ మరియు వివేకానంద డిగ్రీ కాలేజ్‌లకు చెందిన మొత్తం 320 ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు. వాలంటీర్లు మార్కెట్ నుండి కెవిఆర్ సర్కిల్ వరకు ఉన్న ప్రాంతంలో శుభ్రత కార్యక్రమాలు నిర్వహించి, స్వచ్ఛత పై ప్రజలకు అవగాహన కల్పించారు.

కార్యక్రమం ముగిసిన అనంతరం అన్ని వాలం టీర్లకు పాల్గొనిన సర్టిఫికెట్లు పంపిణీ చేయబడ్డాయి. సర్వోదయ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ శ్రీ రాజని మరియు పలు కాలేజీల ఎన్ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ శుభ్రత కార్యక్రమం ద్వారా విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం మరియు దాని ఎన్ఎస్ఎస్ యూనిట్లు పరిశుభ్రమైన, హరితవాతావరణం కలిగిన, బాధ్యతాయుత సమాజ నిర్మాణానికి తమ కట్టుబాటును మరోసారి చాటుకున్నాయి.

# మెడికవర్ హాస్పిటల్స్ నెల్లూరులో ప్రోస్టేట్ విస్తరణపై అవగాహన

## - 40 ఏళ్లు పైబడిన పురుషులు తప్పనిసరిగా స్క్రీనింగ్ చేయించుకోవాలి : మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** పురుషుల్లో ఎక్కువగా కనిపించే బి పి హెచ్ లేదా ప్రోస్టేట్ విస్తరణపై అవగాహన కల్పించేందుకు మెడికవర్ హాస్పిటల్స్ శనివారం నెల్లూరులో ప్రత్యేక ప్రెస్ మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి డా.గోకుల్ నచికేత్. జి, కన్సల్టెంట్ యూరాలజిస్ట్ ముందడుగు వేశారు. డా.గోకుల్ మాట్లాడుతూ పురుషుల్లో 40 సంవత్సరాల వయసు తర్వాత ప్రోస్టేట్ గ్రంధి క్రమంగా పెద్దదవుతూ, మూత్ర విసర్జన సమస్యలు, తరచూ మూత్రం రావడం, నిద్రలో ఇబ్బంది (నాక్టూరియా), బలహీనమైన మూత్ర ప్రవాహం వంటి లక్షణాలు కనబడతాయని తెలిపారు. చాలా మంది ఈ లక్షణాలను సిగ్గు లేదా వయసు కారణంగా సహజమని భావించి వైద్య సలహాను ఆలస్యం చేస్తారని చెప్పారు. లక్షణాలను నిర్లక్ష్యం చేస్తే మూత్రాశయం అవరోధం, మూత్ర నిల్వ, ఇన్ఫెక్షన్లు, చివరికి మూత్రపిండాలకు కూడా నష్టం కలగవచ్చని హెచ్చరించారు. ప్రారంభ దశలోనే అల్ట్రాసౌండ్, డిజిటల్ రెక్టల్ ఎగ్జామినేషన్, పిఎస్ఏ పరీక్ష ద్వారా సమస్యను ఖచ్చితంగా గుర్తించవచ్చని తెలిపారు. మెడికవర్ హాస్పిటల్స్ నెల్లూ రులో అధునాతన యూరాలజీ సేవలు, లేజర్ ప్రోస్టేట్ సర్జరీ వంటి ఆధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నాయని, ఇవి తక్కువ రక్తస్రావం, వేగవంతమైన రికవరీ, వృద్ధులకు సురక్షిత మైన మార్గమని చెప్పారు. "పురుషులు మూత్ర సంబంధ సమస్య లను వయసు కారణంగా సహజమని భావించి నిర్లక్ష్యం చేస్తారు. కానీ ప్రోస్టేట్ విస్తరణ ఒక వైద్య సమస్య. ప్రారంభదశలోనే పరీక్షలు చేయించుకుంటే సులభమైన, సురక్షితమైన చికిత్సలు అందుబాటులో ఉంటాయి. మెడికవర్ హాస్పిటల్స్ నెల్లూరులో ప్రతి రోగికి నిష్ణాత, ఆధారపడదగిన, మరియు కరుణతో కూడిన సేవలు అందించడం మా లక్ష్యం." డా.గోకుల్ నచికేత్. జి, కన్సల్టెంట్ యూరాలజిస్ట్, మెడికవర్ హాస్పిటల్స్, నెల్లూరు. ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్ సెంటర్ హెడ్ లావణ్య మరియు మెడికల్ సూపెర్నడెంట్ డాక్టర్ అభిషేక్ పాల్గొన్నారు.

# డక్కలి యుటిఎఫ్ మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు రెడ్డి ఇకలేరు



**డక్కలి, (రాజధాని వార్తలు):** డక్కలి మండలం విషాదంలో మునిగిపో యింది. ఉపాధ్యాయులలో పోరాటపటిమ కలిగిన నాయకుడిగా, సేవాభావం గల మంచి గురువుగా గుర్తింపు పొందిన యుటిఎఫ్ మాజీ అధ్యక్షుడు డక్కిలి వెంకటేశ్వర్లు రెడ్డి శనివారం కన్నుమూ శారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం తీవ్ర అస్వస్థతకు గురవడంతో కుటుంబ సభ్యులు నెల్లూరులోని అపోలో ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చివరి శనివారం తుదిశ్వాస విడిచారు. ప్రస్తుతం డక్కిలి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు రెడ్డి మృతి వార్త విన్న ఉపాధ్యాయులు, సంఘ నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ సంఘాల్లో సుదీర్ఘకాలం క్రియాశీలకంగా పనిచేసి, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండే నాయకుడిగా ఆయన పేరు తెచ్చుకున్నారు. ఆకస్మిక మరణం ఉపాధ్యాయ వర్గాలకు తీరని లోటని పలువురు అభిప్రాయపడ్డారు. డి వెంకటరెడ్డి మరణవార్త తెలిసిన ఉపాధ్యాయ సంఘ నాయకులు, స్నేహితులు, సహచర ఉపాధ్యాయులు, పలువురు రాజకీయ పార్టీల నాయకులు డక్కలి చేరుకుని మృతదేహానికి నివాళులు అర్పించారు. ఆయన మృతితో డక్కలి మండలం మొత్తం తీవ్ర విషాద ఛాయలు అలుము

# సంపాదకీయం

## పరిశోధనలు విమర్శ కానేరవు

'ప్రమాణాల్లేని నేటి విమర్శ' పేరుతో సుంకర గోపాలయ్య రాసిన వ్యాసానికి (03.11.2025) సమా ధానంగా 'బహుళ స్వరాల నేటి విమర్శ' పేరుతో వెంకట రామయ్య వ్యాసం రాసారు (10.11.2025). ఈ వ్యాసంలో వెంకట రామయ్య- "ఆధునిక (?) విమర్శలో... 'విశ్లేషకుడు' లేదా 'వ్యాఖ్యాత' పాత్ర బలపడింది. ఇది పతనం కాదు, పరిణామం" అన్నారు. విశ్లేషణా, వ్యాఖ్యానము రెండూ ఈనాటివి కాదు గానీ, నాకిక్కడ ఆయన విమర్శా ప్రక్రియను పరిణత రూపంగా చూడకపోవడమే ఆశ్చర్యం కలిగించింది. సుంకర గోపాలయ్య కొత్త పరికరాలు, నిర్దిష్టమైన నిరూపణలు లేని విమర్శ ప్రబలిపోతోందని వాపోయాడు. విమర్శకు ఉండే ఎటువంటి మౌలిక లక్షణానికయినా ప్రమాదం ఏర్పడు తుందన్న భయం కలిగినప్పుడు ఇటువంటి ఆక్రోశం సహజం. రామయ్య కొత్త సిద్ధాంతాలు ఆకాశం నుండి ఊడిపడవన్నారు గానీ ఆయన కూడా నవీన సిద్ధాం తాలను వేటినీ ఉటంకించలేదు. కొంతమంది పేర్లు ప్రస్తావించి విషయాత్మక చర్చను కాస్తా వ్యక్తిగతం చేసేశారు. సిద్ధాంత అన్వయాలు సిద్ధాంతాలు కానట్టే పరిశోధనలు విమర్శ కానేరవన్న సంగతి తెలుసు కోవాలి. "పరిశోధన వ్యాసంలో ఒక వినూత్న సిద్ధాంతం గాని, సమన్వయం గాని, విశ్లేషణం గాని ప్రతిపాదించబడుతుంది. విమర్శ వ్యాసంలో ఒక వినూత్న వివేచనం గాని, దృక్పథం గాని సప్రమాణంగా సమర్పిం చబడుతుంది" అని జీవీ సుబ్రమణ్యం చెప్పారు. ఆయనే కొత్తదనం ప్రయోగం కావచ్చు గానీ, ప్రయోగానికీ విప్లవానికీ తేడా ఉందని అన్నారు కూడా. అలా అయినప్పుడు వ్యాసకర్త ఉదహరించిన పుస్తకాల కన్నా పెద్ద జాబితానే తయారు చేయవచ్చు. ముందుమాటలు, పుస్తక సమీక్షలు, సదస్సుల్లో సమర్పించిన పరి శోధనా వ్యాసాలను గుదిగుచ్చి విమర్శ పేరుతో సంకలనాలు తెచ్చినంత మాత్రాన అవి సాహిత్య విమర్శ అనిపించుకోవు. ఆయా సమీక్షకులను, పరిశోధకులను విమర్శకులుగా గుర్తించడంలో మనకు మరింత పర్యాలోచన, సంయమనం అవసరం. వర్తమాన విమర్శ అభిరుచి స్థాయిలోనే ఉండిపోతోందన్న గోపాలయ్య మనసులో మాటను రామయ్య తెలుసుకోలేకపోయారు. అందుకు గోపాలయ్య వాడిన "గత పదిహేను సంవత్సరాల" అన్న తొందరపాటు ప్రస్తావన కారణం కావచ్చు. అయితే ఇద్దరూ సాహిత్య విమర్శలో అంబేడ్కర్, బౌద్ధం వంటి సిద్ధాంతాల ప్రవేశాన్ని, గణనీయ ప్రభావాన్నీ విస్మరించారు. వర్తమాన సాహిత్య విమ ర్శకు కొత్త సిద్ధాంతాల అవసరం ఉందన్నది ఎంత నిజమో, అసలు అటువంటి ప్రమేయమే మన్నించ లేని ఒక వింత కాలంలోకి మనం నడచి వెళు తున్నామన్నది అంతే నిజం. అదే ఇక్కడ అతి ముఖ్య మైన ప్రమాణ చర్చ. ప్రస్తుతం తెలుగు సాహిత్యంలో, ముఖ్యంగా విమర్శలో అంతటి స్తబ్ధత కొనసాగు తోందన్న బాధగానే గోపాలయ్య వ్యాసం నాకు అర్థమయ్యింది. సామాజిక మాధ్యమాలను ఎంత శక్తివంతంగా వాడుకోవచ్చో 'కవిసంగమం' వంటి ప్రయోగాలు నిరూపించినప్పటికీ- ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో వస్తున్న అన్ని వ్యాసాలనూ లోతైన చర్చలుగా భావించినట్లైతే తెలుగునాట విమర్శకులు లేరని దిగులు చెందవలసిన పని లేదు. గోపాలయ్య కలతపడ్డ ప్రమాణాలు అవి కాదు, పత్రికల్లో వచ్చే సమీక్షలు కూడా కాదు. విమర్శలో కోల్పోతున్న సృజనాత్మక విలువల గురించి ఆయన రాశారు. రామయ్య పరిశోధనకూ లంకె వేశారు గనుక ఇప్పుడు 'మరొకమారు' దాని ఉపజ్ఞత గురించి కూడా అని భావించాలి. విమర్శకు ఆలంబన దృక్పథమే. రామయ్య "బహుళ ప్రమాణాల వైపు పరిణామం" అన్న మాటను చాలా ఆలోచించే వాడారు. ఆధునికోత్తరవాద (పోస్ట్ మాడర్నిజం) ప్రస్తావన కూడా తెచ్చారు. కానీ గోపాలయ్య గోసపడ్డ అప్రమాణికత ఏకత్వమో, బహుళత్వమో కాదు. అధ్యయ నశీలత, ప్రాసంగిక స్వభావము మాత్రమే. అయినప్పటికీ వైధర్మ్యము, మిశ్రితత్వం, బహుళత్వము వంటి ధోరణులు ప్రక్రియకుండే శాస్త్ర మూలాన్ని మార్చలేవు. వర్తమాన సాహిత్యంలో ఈ బహుళతా త్మికత వరమా శాపమా ఇంకా తేలవలసి ఉంది. కొప్పర్తి, బి.తిరుపతిరావు, సుంకిరెడ్డి, జిలుకర శ్రీనివాస్, అఫ్సర్ వంటివారు ఆ దిశగా ఎంతో కృషి చేస్తున్నారు కూడా. అయితే గతాన్ని ఆదర్శీకరిస్తు న్నారని తేలిగ్గా తీసిపారేస్తున్నారు గానీ కట్టమంచి, రాళ్ళపల్లి, రారా, టీఎమ్మెస్ వంటి వారికి తెలుగు సాహిత్య విమర్శలో క్లాసిక్ స్థానం ఇవ్వడం సము చితమే. వీళ్ళే కాదు విమర్శకున్న ప్రయోగశీలతను, దార్శనికతను, విలక్షణతను నిలబెట్టిన మహాను భావులెందరినో ఈ తరం స్ఫూర్తిగా తీసుకోని అధ్యయనం చేయాలి.

# ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోండి

### - రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ ఎల్.ఆర్.ఎస్, బి.పి.ఎస్ పథకాల గోడపత్రికలను ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో ఎల్.ఆర్.ఎస్, బి.పి.ఎస్ పథకాలపై అవగాహన కల్పిస్తూ ఏర్పాటుచేసిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలక పట్టణ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ మాట్లాడుతూ భవన యజమానుల సౌకర్యార్థము రాష్ట్ర ప్రభుత్వం బి.పి.ఎస్ - 2025 ఎల్.ఆర్.ఎస్ - 2025 పథకాల మార్గదర్శకాలను జారీ చేసిందన్నారు. బి.పి.ఎస్ పథకంలో 01-01-1985 నుంచి 30-08-2025 మధ్యకాలంలో అనధికారికంగా, అనుమతికి మించి నిర్మించిన భవనాలను 11-03-2026 తేదీ లోపల ఆన్లైన్ ద్వారా దాఖలు చేసుకోవాలని తెలియజేశారు. పూర్తి వివరాల కోసం WWW.BPS.ap.gov.in వెబ్సైట్‌ను సంప్రదించాలని తెలిపారు. ఎల్.ఆర్.ఎస్ - 2025 పథకంలో అనధికార లేఔట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పిస్తూ యాజమాన్యపు హక్కును పొందేందుకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 30-06-2025 తేదీకి ముందు వేసిన అనధికార లేఅవుట్లలోని రిజిస్టర్ కాబడిన అనధికార ప్లాట్లను ప్రణాళిక బద్ధంగా క్రమబద్ధీకరించేందుకు ఈ పథకాన్ని కొనసాగిస్తున్నామని తెలియజేశారు. పూర్తి వివరాలకు 1800-425-1113 టోల్ ఫ్రీ నెంబరును లేదా 7981651881 నెంబరు హెల్ప్ లైన్ ను సంప్రదించాలని, అధికారిక వెబ్సైట్ (http://dtcp.ap.gov.in/LRS) లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆవిష్కరించిన గోడపత్రికలను అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ప్రదర్శించేలా, బిపిఎస్ స్టిక్కర్లను అన్ని అనధికార భవనాలకు అంటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యేలు, కావ్య క్రిష్ణారెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, కమీషనర్ నందన్, కావలి, కందుకూరు మున్సిపల్ కమీషనర్లు, టౌన్ ప్లానింగ్,ఇంజనీరింగ్, పబ్లిక్ హెల్త్ అధికారుల నూడ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నవజీవన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీ






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని దీన దయాల్ నగర్‌లో శనివారం మోంత తుఫాన్ బాధితులకు సహాయార్థం లో భాగంగా నవజీవన్ ఆర్గనైజషన్ (ఎన్ జి ఓ) ఆధ్వర్యంలో 350 మంది వేస్ట్ ప్యాకర్స్‌కు ఒక్కొక్కరికి 2దుప్పట్లు,10 కిలోల బియ్యం నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నవజీవన్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ కె సహదేవయ్య మాట్లాడుతూ మొంతా తుఫాన్ ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన వేస్ట్ పేకర్స్ కు తమ వంతు సహకారం అందిస్తూ నిత్యవసర వస్తువులు దుప్పట్లు పంపిణీ చేయడం జరిగింది అన్నారు.ఆపదలో ఉన్న పేదవారికి తమ వంతు సహాయం అందిస్తున్న నవజీవన్ ఆర్గనైజేషన్ సేవలను పలువురు అధికారులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఐ టి డి ఎ పి ఓ మల్లికార్జున రెడ్డి, సెట్నెల్ సీఈఓ నాగేశ్వరావు, విక్రమ సింహపురి యూనివర్సిటీ ఆర్ డి సైదా నాయక్, ఎన్ ఎస్ ఎస్ కోఆర్డినేటర్ ఉదయ్, ఎన్ వై కె నెల్లూరు జిల్లా యూత్ ఆఫీసర్ మహేందర్ రెడ్డి, నవజీవన్ ఆర్గనైజషన్ ప్రెసిడెంట్ కె. సహదేవయ్య,డైరెక్టర్ కె.విక్టోరియా నవజీవన్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉప ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టండి

### - కలెక్టర్ మహేష్ కుమార్, ఎమ్మెల్యే వరప్రసాద్





**అమలాపురం, (రాజధాని వార్తలు):** అంబేద్కర్ కోనసీమ జిల్లాలో తొలిసారిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కే పవన్ కళ్యాణ్ పర్యటన సందర్భంగా పటిష్ట భద్రత, ఏర్పాట్లను చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 26న రాజోలు నియోజకవ ర్గంలో ఉపముఖ్యమంత్రి పర్యటన ఉదయం 10:30 గంటల నుండి ప్రారంభమవుతుందని కలెక్టర్ తెలి పారు. ఉప ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంతంగా నిర్వహించడానికి జిల్లా యంత్రాంగం భద్రతా చర్యలను బలోపేతం చేయా లని కలెక్టర్ సూచించారు. పర్యటన ఏర్పాట్లపై శనివారం స్థానిక లింగోలు సత్యనారాయణ విజయ లక్ష్మి కళ్యాణ వేదిక వద్ద ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులతో కలెక్టర్, ఎమ్మెల్యే సమీక్షించారు. స్టార్ ఇమేజ్ ఉన్న ఉప ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ క్యాడర్, అభిమా నులు పూర్తిగా సహకరించాలని కలెక్టర్ మహేష్ కుమార్ కోరారు. స్టార్ ఇమేజ్ కలిగిన పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రి హెూదాలో తొలిసారిగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాకు వస్తున్నా రని అభిమానులు, పార్టీ క్యాడర్ సంయమనం పాటిస్తూ పర్యటననువిజయ వంతం చేయాలన్నారు. శివకోడు సభా ప్రాంగణము వద్ద సుమారు పదివేల మంది పాల్గొనేందుకు వీలుగా ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. రాష్ట్రస్థాయి పల్లె పండుగ 2.0 కార్యక్రమం కావున కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా శం కుస్థాపన కార్యక్రమాలు, శిలాఫలకాల ఆవిష్కరణ కార్యక్రమాలు సజావుగా నిర్వహించేలా సభాస్థలి వద్ద అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. స్థానిక శాసన సభ్యులు దేవ వరప్రసాద్ మాట్లాడుతూ ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ నియోజకవర్గం విచ్చేస్తున్న తరుణంలో ప్రతి ఒక్కరు పరస్పర సహకారంతో పర్యటనను విజయవంతం చేసేందుకు కృషి చేయా లని కోరారు.

కలెక్టర్ నిర్దేశించిన విధులు, బాధ్యత లను సమర్థవంతంగా చేపట్టి పర్యటన విజయవంతం చేయాలన్నారు. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా మాట్లా డుతూ పర్యటన అంతటా పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణ అంశాలలో అప్రమత్తంగా వ్యవహరించేలా చర్యలు చేపట్టడం జరుగుతుందని అలాగే ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా బందోబస్తు ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్ర మంలో జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి, ఆర్డీవో మాధవి స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# మహారాణి సేవలు భావితరాలకు అందేలా చర్యలు

### - 190వ వర్ధంతిలో ఎమ్మెల్యే చినరాజప్ప



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం మహారాణి బుచ్చి సీతయ్యమ్మ సేవలు భావితరాలకు కూడా గుర్తించుకునేలాగా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరా జప్ప అన్నారు. పెద్దాపురం మహారాణి 190 వర్ధంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మహారాణి సత్రం ఈవో కాట్నం జగన్మోహన్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, మాజీ మున్సి పల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజులు పాల్గొని పేదలకు వస్త్రదానం, అన్నదానం కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహారాణి 1828లో ప్రారంభించిన అన్నదాన, విద్యాదాన సేవలు నేటికీ కొనసాగడం విశేషమన్నారు. ఆమె సేవలు యావత్ భారతదేశానికి ఆదర్శమని కొనియాడారు. పెద్దాపురంలో 550 ఎకరాల్లో, కత్తిపూడి గ్రామంలోనూ బాటసారుల కోసం సత్రాలు ఏర్పాటు చేయగా అవి నేటికీ బాట సారులకు, పేద విద్యార్థులకు ఎలాంటి ఆటంకం లేకుండా కొన సాగుతున్నాయాన్నారు. కాగా ఈవో జగన్మోహన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ 200 స్వత్సరాల క్రితం నిర్మించిన భవనాలు కొన్ని శిధిలా వస్థకు చేరుతున్నందున వాటికి రిపేర్లు చేపడితే మరో వందేళ్లపాటు చరిత్రను కొనసాగించే అవకా శం ఉంటుందని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్ర మంలో మాజీ మహారాణి సత్రం చైర్మన్ తూతిక రాజు, రండి సత్యనారాయణ, నూనె రామారావు చౌదరి, కొరుపూరి రాజు, పొలమరశెట్టి సత్తిబాబు, ఒబిలిశెట్టి గణేష్, మట్టే శ్రీనివాసరావు, తమ్మన మైనర్ బాబు, నున్న భాస్కరరావు, యాళ్ళ వీరబాబు, కఠారి శ్రీనివాసరావు బేదంపూడి సత్తిబాబు, మేడిశెట్టి వెంకటేష్, కొల్లి రాజు, ఆకాశపు భద్రరావుతో పాటు పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# గొడ్డటిపాలెంలో ఉపాధి హామీ పథకంపై గ్రామసభ




**కరప, (రాజధాని వార్తలు):** కరప మండలం, గొడ్డటిపాలెం గ్రామ పంచాయతీ ఆవరణలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంపై గ్రామసభను సర్పంచ్ గోన అనూష ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి డిప్యూటీ ఎంపీడీఓ సలాది వెంకట శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. గ్రామ ప్రజలకు ఉపాధి హామీ పథకం ద్వారా అందుతున్న సేవలు, జాబ్‌కార్డు నమోదు ప్రక్రియ, పనుల అమలు విధానం వంటి అంశాలపై ఆయన వివరించారు. పథకం మరింత సమర్థవం తంగా అమలయ్యేందుకు గ్రామస్థుల సూచనలు, అభిప్రాయాలను స్వీకరిం చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి త్రిపుర శంకర్ జనసేన గ్రామ అధ్యక్షుడు వీరం రెడ్డి ముత్యాలరావు, నీటిసంఘం డైరెక్టర్ కడియాల సత్యనారాయణ, టీడీపీ నాయ కులు వాసంశెట్టి సూర్యనారాయణ, సవరపు లాదర్, ఫీల్డ్ అసిస్టెంట్ పెంకె సత్య సురేష్, డ్వాక్రా యానిమేటర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# తొలి తిరుపతి ఆదాయం రూ. 2.12 లక్షలు



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం మండలం చదలాడ తిరుపతిలోని శ్రీ శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒక్కరోజు ఆధాయం రూ. 2,12,802 ఆధాయం వచ్చినట్టు ఆలయ కార్యనిర్వాహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన తెలుపుతూ ఆలయానికి ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ. 1,32,900 అన్నదాన విరాళాల ద్వారా రూ. 48,762, కేశఖండన ద్వారా రూ. 9,560, తులాభారం ద్వారా రూ. 250, లడ్డు ప్రసాదం ద్వారా రూ. 21,330 వెరసి రూ. 2,12,802లు ఆదాయం వచ్చినట్టు ఈవో వివరించారు. కాగా శనివారం ఆలయానికి విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య 15 వేల మంది కాగా 3000 మంది భక్తులు స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ పూజల్లో ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణ ఆచార్యులు, గ్రామ నాయకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## శంభాల : విడుదలకు ముందే అదిరిపోయే బిజినెస్




ఈ రోజుల్లో కంటెంట్ ఉంటే చాలు.. కాసుల వర్షం కురుస్తుందని మరోసారి రుజువైంది. హీరో గత సినిమాలు హిట్టయ్యాయా అన్నది పక్కన పెడితే.. కథలో దమ్ముంటే బిజినెస్ దానంతట అదే జరుగుతుంది. సరిగ్గా ఇప్పుడు టాలీవుడ్ యంగ్ హీరో ఆది సాయికుమార్ సినిమా విషయంలో ఇదే జరిగింది. విడుదలకు ఇంకా నెల రోజులు ఉండగానే, శంభాల సినిమా టేబుల్ ప్రాఫిట్ దిశగా అడుగులు వేస్తోంది. ఈమధ్య కాలంలో నాన్ థియేట్రికల్ రూట్లో సినిమాలకు అంతగా బిజినెస్ కలిసి రావడం లేదు. కానీ శంభాల సినిమా కాన్సెప్ట్, రీసెంట్‌గా వచ్చిన ట్రైలర్ క్రియేట్ చేసిన ఇంపాక్ట్‌తో సీన్ మొత్తం మారిపోయింది. మేకర్స్ ఊహించని రేంజ్‌లో బిజినెస్ ఆఫర్స్ వచ్చాయి. థియేటర్లో రిలీజ్ కాకముందే డిజిటల్, శాటిలైట్ హక్కుల రూపంలో నిర్మాతల జేబులు నిండాయి. ఆది సాయికుమార్ సరికొత్త రోల్ లో నటిస్తున్న మిస్టిక్ థ్రిల్లర్ 'శంభాల' ఓటీటీ హక్కులను ప్రముఖ తెలుగు ఓటీటీ సంస్థ 'ఆహా' ఫ్యాన్సీ రేటుకు దక్కించుకుంది. కేవలం టీజర్, ట్రైలర్ చూసే ఈ డీల్ క్లోజ్ అయినట్లు తెలుస్తోంది. ఇక బుల్లితెర విషయానికి వస్తే, ప్రముఖ ఛానల్ 'జీ తెలుగు' ఈ సినిమా శాటిలైట్ హక్కులను సొంతం చేసుకుంది. రిలీజ్‌కు ముందే ఇలా రెండు మెయిన్ డీల్స్ క్లియర్ అవ్వడం సినిమాపై ఉన్న క్రేజ్ ను చూపిస్తోంది. అసలు ఈ రేంజ్ డిమాండ్ రావడానికి ప్రధాన కారణం ఇందులోని కథాంశం. 1980ల నాటి పల్లెటూరు, ఉల్కాపాతం, శివుడు, అసురుడి మధ్య యుద్ధం అనే బ్యాక్‌డ్రాప్ బయ్యర్లను బాగా ఆకర్షించింది. ట్రైలర్‌లో సాయికుమార్ వాయిస్ ఓవర్, సూపర్ నేచురల్ ఎలిమెంట్స్ సినిమా స్థాయిని పెంచేశాయి. సైన్స్‌కు, దైవశక్తికి మధ్య జరిగే యుద్ధం కాబట్టి ఆడియన్స్ కచ్చితంగా కనెక్ట్ అవుతారని ఓటీటీ, టీవీ ఛానళ్లు నమ్ముతున్నాయి. యుగంధర్ ముని దర్శకత్వంలో రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం విజువల్‌గా చాలా గ్రాండ్‌గా ఉండబోతోంది. ఆది సాయికుమార్ ఇందులో జియాలజిస్ట్‌గా చేస్తుండగా, అర్చన అయ్యర్, స్వాసిక హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఓ వైపు గ్రాఫిక్స్, మరోవైపు గ్రిప్పింగ్ స్క్రీన్ ప్లేతో వస్తున్న ఈ సినిమాను 'ఆహా' చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్లు టాక్. బిజినెస్ పరంగా ఇప్పటికే సక్సెస్ కొట్టిన 'శంభాల', బాక్సాఫీస్ దగ్గర కూడా అదే జోరు చూపిస్తుందేమో చూడాలి. డిసెంబర్ 25న క్రిస్మస్ కానుకగా ఈ సినిమా గ్రాండ్‌గా థియేటర్లలోకి రానుంది. ఇక పవర్ఫుల్ హిట్టు కోసం చూస్తున్న ఆదికి.. ఈ సినిమా కమర్షియల్‌గా పెద్ద బ్రేక్ ఇచ్చేలా కనిపిస్తోంది.

## సంక్రాంతికి 'రాజు' గారు రావడం లేదా?



టాలీవుడ్ సినీ ఇండస్ట్రీకి సంక్రాంతి సీజన్ కీలకమని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. ఏటా పొంగల్ కు అనేక సినిమాలు ప్రేక్షకుల ముందుకు వస్తాయి. బెర్తులను ఖరారు చేసుకోవడానికి ముందు నుంచే కర్చీఫులు వేసుకుంటాయి. కచ్చితంగా పెద్ద పండగకే విడుదల చేయాలని మేకర్స్, హీరోలు ఫిక్స్ అవుతుంటారు. బాక్సాఫీస్ వద్ద పోటీ పడుతుంటారు. వచ్చే ఏడాది సంక్రాంతి పండగకు కూడా పలు సినిమాలు థియేటర్స్‌లోకి రానున్నాయి. అందుకు గాను ఇప్పటికే ఆయా చిత్రాల మేకర్స్ ఫిక్స్ అయ్యారు. అందుకు అనుగుణంగా సినిమాలకు సంబంధించిన పనులు పూర్తి చేసుకుంటున్నారు. త్వరలో తమ మూవీల రిలీజ్ డేట్స్‌ను స్పెషల్ అప్డేట్స్‌తో అనౌన్స్ చేయనున్నారు. అయితే 2026 సంక్రాంతికి చిరంజీవి మన శంకరవరప్రసాద్ గారు, ప్రభాస్ ది రాజా సాబ్, రవితేజ భర్త మహాశయులకు విజ్ఞప్తి, విజయ్ జన నాయగన్ రిలీజ్ అవ్వనున్నాయి. శర్వానంద్ నారీ నారీ నడుమ మురారి కూడా విడుదలవుతుందని టాక్. యంగ్ హీరో నవీన్ పోలిశెట్టి లీడ్ రోల్‌లో నటించిన అనగనగా ఒక రాజు కూడా పొంగల్‌కు రానుందని ఇప్పటికే అనౌన్స్ చేశారు మేకర్స్. జనవరి 14వ తేదీన విడుదల చేస్తామని తెలిపారు. ఇప్పటికే సినిమా నుంచి రిలీజ్ చేసిన ప్రమోషనల్ కంటెంట్ రావడంతో సినీ ప్రియులు మంచి అంచనాలు పెట్టుకున్నారు. ఫ్యామిలీ అండ్ కామెడీ ఎంటర్టైనర్ గా రానున్న ఆ మూవీ కోసం వెయిట్ చేస్తున్నారు. కానీ ఇప్పుడు జనవరి 14వ తేదీన అనగనగా ఒక రాజు మూవీ రిలీజ్ అయ్యేటట్లు లేదని టాక్ వినిపిస్తోంది. సంక్రాంతికి భారీ పోటీ ఉండడంతో అనగనగా ఒక రాజు మూవీ.. వెనకడుగు వేసిందని ఇప్పుడు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. జనవరి 23వ తేదీన సినిమా రిలీజ్ అయ్యే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. అది కాకపోతే.. రిపబ్లిక్ డే వీకెండ్‌లో విడుదల్వనుందని టాక్ వినిపిస్తోంది.

కానీ మేకర్స్ నుంచి ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అయితే భారీ పోటీ ఉందని ఇప్పుడు తప్పు కున్నా.. ప్రచారంలో ఉన్న కొత్త తేదీ కూడా అంత సేఫ్ కాదు. ఎందుకంటే సంక్రాంతికి థియేటర్స్‌లో భారీ సినిమాలు రిలీజ్ అవ్వనున్నాయి. వాటికి పాజిటివ్ టాక్ వస్తే కచ్చితంగా కొన్ని రోజులపాటు ఓ రేంజ్‌లో సందడి చేస్తాయి. కాబట్టి అనగనగా ఒక రాజు కొత్త తేదీ కూడా కాస్త రిస్క్‌తో కూడకు న్నదే. అదే సమయంలో మూవీ రిలీజ్ ఇప్పటికే చాలా లేట్ అయింది. ఇప్పుడు మళ్లీ వాయిదా పడేలా కనిపిస్తోంది. మరి మేకర్స్ ఏం చేస్తారో వేచి చూడాలి.

## ఆ సినిమాకు నేషనల్ అవార్డు వచ్చినా కొత్త అవకాశాలు మాత్రం రాలేదు



మామూలుగా సినీ ఇండస్ట్రీలో ఎవరికైనా ఒక సక్సెస్ వస్తే ఆ తర్వాత ఆఫర్లు ఎలా క్యూ కడతాయో అందరికీ తెలిసిందే. కానీ ఓ స్టార్ హీరోయిన్ కు మాత్రం కెరీర్ బెస్ట్ మూవీ వచ్చాక కూడా ఆరేడు నెలల పాటూ ఎలాంటి కొత్త ఆఫర్లు రాలేదని చెప్తోంది. ఆ హీరోయిన్ ఎవరో కాదు, మలయాళ భామ కీర్తి సురేష్. ఇండియన్ మూవీ హిస్టరీలో ఇప్పటివరకు వచ్చిన బెస్ట్ బయోపిక్స్‌లో సావిత్రి జీవితంపై తీసిన మహానటి సినిమా కూడా ఒకటి. ఆ సినిమాలో సావిత్రి క్యారెక్టర్‌లో ఎంతో గొప్ప యాక్టింగ్ చేసి ఆడియన్స్‌తో కన్నీళ్లు పెట్టించిన కీర్తి సురేష్ మహానటి మూవీలో యాక్టింగ్‌కు గాను నేషనల్ అవార్డు కూడా అందుకున్నారు. అప్పటివరకు సినిమాల సెలక్షన్‌తో సతమతమవుతున్న కీర్తి సురేష్‌కు మహానటి సినిమా కొత్త కెరీర్‌ను అందించింది. ఈ సినిమాతో కీర్తి అందుకున్న సక్సెస్, క్రేజ్, నటిగా ఆమె పొందిన గుర్తింపు అంతా ఇంతా కాదు.

సావిత్రి క్యారెక్టర్‌లో జీవించి మెప్పించిన కీర్తి సురేష్ మహానటి తర్వాత వరుస ఛాన్సులతో బిజీగా ఉంటుందనుకుంటే తనకు ఓ వింత ఎక్స్‌పీరియెన్స్ ఎదురైనట్టు చెప్పారు. మహానటి తర్వాత తన లైఫ్ లో ఎదురైన పరిణామాల గురించి కీర్తి రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. మహానటి తర్వాత ఇండస్ట్రీలో తన మీద అంచనాలు చాలా పెరిగాయని చెప్పారు కీర్తి. ఆ సినిమా తర్వాత తనను స్పెషల్ క్యారెక్టర్లలోనే ఆడియన్స్ ఊహించుకున్నారని, అందుకే తనకు ఆ తర్వాత రెగ్యులర్ కమర్షియల్ సినిమాలు రాలేదని, దర్శక నిర్మాతలు కూడా తనను మహానటి లాంటి క్యారెక్టర్లలోనే ఊహించుకున్నారని, అందుకే తనకు కథలు, క్రియేటివ్ క్యారెక్టర్లు ఎక్కువగా రాలేదని, మహానటి రిలీజైన తర్వాత తనకు 6 నెలల పాటూ ఎలాంటి ఛాన్సులు రాలేదని కీర్తి చెప్పారు. ఆ ఆరు నెలల్లో తనకు ఎవరూ కథలు కూడా చెప్పలేదని, ఆ గ్యాప్‌ను తాను మేకోవర్ కోసం వాడుకున్నట్టు చెప్పారు కీర్తి. కొంచెం టైమ్ తీసుకుని ఓపికగా వ్యవహరించాక కీర్తికి మళ్లీ ఛాన్సులు వచ్చి, స్టార్ హీరోలందరి సరసన నటించి స్టార్ హీరోయిన్‌గా మారగా, కీర్తి నటించిన రివాల్వర్ రీటా నవంబర్ 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. గత కొన్నాళ్లుగా సినిమాల విషయంలో కాస్త బ్రేక్ తీసుకున్న కీర్తికి ఈ సినిమా సక్సెస్ ఎంతో కీలకం కానుంది.

## స్వయంభు: రెండేళ్ల కష్టం.. 170 రోజుల యుద్ధం




ఒక సినిమా కోసం హీరోలు కష్టపడటం సహజం. కానీ ఆ సినిమానే లోకంగా, ఆ పాత్రే ప్రాణంగా రెండేళ్లు బతకడం అంటే మామూలు విషయం కాదు. ఇన్నాళ్లు సైలెంట్‌గా ఉన్న యంగ్ హీరో నిఖిల్ సిద్దార్థ్, ఇప్పుడు సడెన్‌గా ఒక వీడియో వదిలి ఇండస్ట్రీని షేక్ చేశాడు. ఆ విజువల్స్, ఆ గ్రాండియర్ చూస్తుంటే.. అతని సినిమానేనా, లేక హాలీవుడ్ రేంజ్ అవుట్ పుట్టా అనే అనుమానం రాకమానదు. కొన్ని సినిమాలు బాక్సాఫీస్ దగ్గర హిట్టు కొడతాయి, కానీ కొన్ని సినిమాలు చరిత్రలో నిలిచిపోతాయి. అలాంటి ఒక హిస్టారికల్ వండరాన్ని సృష్టించే పనిలో పడ్డారు ఆ మేకర్స్. వేల మంది ఆర్టిస్టులు, భారీ సెట్టింగులు, కనీవినీ ఎరుగని యుద్ధ సన్నివేశాలు.. ఇదంతా చూస్తుంటే ఏదో పెద్ద ప్లానింగే జరిగినట్లు అనిపిస్తోంది. ఇప్పుడు ఆ కష్టానికి ఎండ్ కార్డ్ పడింది. అవును.. యంగ్ హీరో నిఖిల్ సిద్దార్థ్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'స్వయంభు' గురించే ఈ చర్చ. లేటెస్ట్‌గా రైజ్ ఆఫ్ స్వయంభు అంటూ వీడియో రిలీజ్ చేశారు. అందులో నిఖిల్ పర్ఫెక్ట్ మేకింగ్ గురించి వివరించారు. దాదాపు రెండేళ్ల పాటు ఈ ప్రాజెక్ట్ కోసం నిఖిల్ ఎన్నడూ లేనంతగా కష్టపడ్డాడు అనే చెప్పాలి. సుమారు 170 రోజుల పాటు జరిగిన షూటింగ్‌లో నిఖిల్ పడిన కష్టం ఇప్పుడు రిలీజ్ చేసిన మేకింగ్ వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా షూటింగ్ పూర్తయినట్లు చిత్ర యూనిట్ ఘనంగా ప్రకటించింది. మన చరిత్ర, సంస్కృతి, ఆచారాలకు అద్దం పట్టే కథ ఇది. పుస్తకాల్లో దొరకని ఒక గొప్ప వీరుడి గాథను వెండితెరపై ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ విజువల్ వండర్ ను 2026 ఫిబ్రవరి 13న, మహాశివరాత్రి పర్వదినాన ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు మేకర్స్ అఫిషియల్‌గా అనౌన్స్ చేశారు. భువన్, శ్రీకర్ భారీ బడ్జెట్‌తో నిర్మించిన ఈ సినిమా నిఖిల్ కెరీర్‌లోనే హైయెస్ట్ బడ్జెట్ ఫిలిం కావడం విశేషం. ఈ బీటీఎస్ వీడియో చూస్తుంటే గూస్ బంప్స్ వస్తున్నాయి. లైట్ బాయ్ నుంచి డైరెక్టర్ వరకు ప్రతి ఒక్కరి కష్టాన్ని నిఖిల్ ఈ వీడియోలో ఎలివేట్ చేశాడు. ప్రతి ఫ్రేమ్‌లోనూ గ్రాండియర్ కనిపిస్తోంది. ముఖ్యంగా కేకే సెంథిల్ కుమార్ సినిమాటోగ్రఫీ, రవి బస్రూర్ సంగీతం ఈ సినిమాకు ప్రధాన బలాలు కానున్నాయి. ఇండియన్ స్క్రీన్ మీద మరోసారి మన చరిత్ర ఘనతను చాటిచెప్పేలా ఈ సినిమా ఉండబోతోందని అంటున్నారు. 'కార్తికేయ 2' తర్వాత నిఖిల్ రేంజ్ పూర్తిగా మారిపోయింది. ఇప్పుడు 'స్వయంభు'తో ఆ రేంజ్‌ను పీక్స్‌కు తీసుకెళ్లాలని డిసైడ్ అయ్యాడు. షూటింగ్ పూర్తి చేసుకోవడంతో ఇక పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరగనున్నాయి. ఫ్యామిలీ ఆడియన్స్‌తో పాటు యూత్ ను కూడా మెప్పించేలా ఈ సినిమా ఉండబోతుందని అర్థమవుతోంది. మరి ఈ 'స్వయంభు' బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి చరిత్ర సృష్టిస్తాడో చూడాలి.

# కేసుల సత్వర పరిష్కారమే లక్ష్యంగా 13న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నాం : జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** స్థానిక జిల్లా న్యాయస్థానంలోని న్యాయమూర్తి వారి ఛాంబర్‌లో నిర్వహించిన ప్రభుత్వ శాఖల సమన్వయ కమిటీ ఉన్నతస్థాయి సమావేశంలో లోక్ అదాలత్ కేసులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న సేవలపై ఆయన ప్రత్యేకంగా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ జిల్లాలో 50 వేల కేసులు పెండింగ్‌లో వున్నాయని, కేసులను వీలైనంత త్వరగా పరిష్కరిం చేందుకు హైకోర్టు వారి ఆదేశాల మేరకు లోక్అదాలత్‌లను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. లోక్అదాలత్‌కు అర్హత గల కేసులను మాత్రమే అదాలత్‌లో పెట్టాలని పోలీసు అధికారులకు న్యాయ మూర్తి సూచించారు. అన్ని ఇన్సురెన్సు కంపెనీలు కూడా రోడ్డు ప్రమాదాల కేసుల విషయంలో నష్టపరిహారాన్ని త్వరగా చెల్లిం చేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. డిసెంబర్ 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకుని సత్వర న్యాయం పొందాలని ప్రజలకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచించారు.

**ఒక్క పోస్టుకార్డుపై సమస్యను తెలపండి... ఉచితంగా న్యాయసేవలు పొందండి**

ప్రజలు సమాజంలో తమకు కలుగుతున్న ఇబ్బందులను ఒక్క పోస్టుకార్డుపై రాసి జిల్లా న్యాయసేవాధికార సంస్థకు పంపితే, ఆ సమస్యను విచారించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ తెలిపారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా న్యాయసహాయం పొందాలని పిలుపునిచ్చారు.

అనేక కేసుల్లో పౌరులకు నష్టపరిహారం, న్యాయసేవలను న్యాయసేవాధికార సంస్థ ద్వారా అందించినట్లు ఆయన వివరించారు. సెంట్రల్ జైలులోని ఖైదీలకు కూడా బెయిలు మంజూరులో ఉచిత న్యాయసహాయం అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఉచిత న్యాయ సహాయం కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని ఆయన సూచించారు.

# ఎమ్మెల్యే ప్రశాంతమ్మ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరాలు

- నియోజకవర్గ వ్యాప్తంగా ఉత్సాహంగా జన్మదిన వేడుకలు - వాడవాడలా కేక్ కటింగులు, రక్తదాన శిబిరాలు - టిడిపి, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఆలయాల్లో ప్రత్యేక పూజలు, ఉచిత వైద్య శిబిరాలు







**కోవూరు, (రాజధాని వార్తలు):** కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి జన్మదినం సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా టిడిపి మరియు కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు రక్తదాన శిబిరాలు నిర్వ హించారు. కోవూరు మండల కేంద్రంలోని పివిఆర్ కల్యాణ మండపంలో టిడిపి మాజీ మండలాధ్యక్షులు మరియు తెలుగు యువత ఆధ్వర్యంలో మెడికవర్, జయభారత్ హాస్పిటల్స్ సహకా రంతో ఉచిత వైద్య శిబిరంలో పాటు 130 మంది రక్తదానం చేశారు. కోవూరు టిడిపి అధ్యక్షులు కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇనుమడుగులో 150 మంది రక్తదానం చేశారు. విడవలూరు మండల కేంద్రంలో టిడిపి మండల అధ్యక్షులు ఏటూరి శ్రీహరి రెడ్డి, టీడీపీ నేతలు అడపాల శ్రీధర్ రెడ్డి, పూండ్ల అచ్యుత్ రెడ్డిల ఆధ్వర్యంలో 106 మంది రక్తదానం చేశారు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో పట్టణ అధ్యక్షులు గుత్తా శ్రీనివాస రావు, మాజీ పట్టణ అధ్యక్షులు ఎంవి శేషయ్యల ఆధ్వర్యంలో 125 మంది రక్తదానం చేశారు.

ఇందుకూరు పేట మండలంలో మండల పార్టీ అధ్యక్షులు ఏకొల్లు, పవన్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో 150 మంది రక్తదానం చేయగా కొడవలూరు మండల పార్టీ అధ్యక్షులు నాపా వెంకటేశ్వర్లు నాయుడు ఆధ్వర్యంలో 170 మంది నాయకులు మరియు కార్యకర్తలు రక్తదానం చేసి ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి తమకున్న అభిమానాన్ని చాటి చెప్పారు. ఈ సందర్భంగా నియోజకవర్గ టీడీపీ నాయకులు మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అన్న ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆశయా లకు అనుగుణంగా భాగంగా ఆడంబరాలకు దూరంగా ఆమె జన్మదినం సందర్భంగా చెట్లు నాటడం, రక్తదాన మరియు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

# పర్యావరణహితం.. ప్రశాంతమ్మ జన్మదినం

- అన్ని మండలాల్లో విస్తృతంగా మొక్కలు నాటిన కూటమి నాయకులు
- ప్రశాంతమ్మ పిలుపుకు కదిలిన కోవూరు నియోజకవర్గం




**బుచ్చిరెడ్డిపాలెం, (రాజధాని వార్తలు):** ఒక్క పిలుపు.. వందల మొక్కలకు ఊపిరిలిచ్చింది. పర్యావరణ పరిరక్షణకు బాసటగా నిలిచింది. తన జన్మదిన వేడుకలను ఆర్భాటాలకు దూరంగా, పర్యావరణ హితంగా నిర్వహించాలని, మొక్కలు నాటాలని ఎమ్మెల్యే ప్రశాంతమ్మ నియోజకవర్గ నాయకులకు ఇచ్చిన పిలుపు తో నాయకులు, కార్యకర్తలు భారీగా స్పందించారు. శనివారం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో విస్తృతంగా మొక్కలు నాటి ప్రశాంతమ్మపై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. కొడవలూరు మండలం టీడీపీ అధ్యక్షులు నాపా వెంకటేశ్వర్లు నాయుడు, మల్లికార్జున్ తదితరులు రాజుపాలెం, అడ్డబజార్ వీధి తదితర ప్రాంతాల్లో ప్రశాంతమ్మ పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటారు. టీడీపీ నాయకులు చెంచు కిషోర్, ఇతర నాయకులు పున్నూరులో, జగదేవిపేటలో ఇందుకూరుపేట మండల పార్టీ అధ్యక్షులు పవన్ కుమార్‌రెడ్డి మొక్కలు నాటి కేకు కట్ చేశారు. అలాగే బుచ్చిరెడ్డిపాలెం ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ ఆధ్వర్యంలో 4వ వార్డు, 3వ వార్డుల్లో కౌన్సిలర్లు శివారెడ్డి, ప్రత్యూష, ఇతర నాయకులు మొక్కలు నాటారు. కోవూరు మండలం గుమళ్లదిబ్బ గ్రామంలోని పాఠశాలలో మాజీ మండలపార్టీ అధ్యక్షులు ఇంతా మల్లారెడ్డి, నాయకులతో కలిసి మొక్కలు నాటి కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ.. సేవలో నిబద్ధత, ప్రజల కోసం పోరాడే ధైర్యవంతురాలు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అని కొనియాడారు. గడిచిన 17 నెలల్లో ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా విపిఆర్ ఫౌండేషన్ ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని తెలిపారు. నియోజకవర్గంలో క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్‌లు ఉచితంగా ఉచితంగా నిర్వహించారని వెల్లడించారు. నియోజవర్గాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తూ పరిశ్రమలు తెచ్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. మెగా జాబ్ మేళాలు నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. టీటీడీ బోర్డు సభ్యురాలుగా శ్రీవారి భక్తులకు విశిష్ట సేవలు అందిస్తున్నారన్నారు. ప్రశాంతమ్మ ఆ భగవంతుడి ఆశీస్సులతో నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని, మరిన్ని ఉన్నత శిఖరాలు అదిరోహించాలని ఆకాంక్షించారు.

# లేబర్ కోడ్ల అమలును వ్యతిరేకిస్తూ కేంద్ర కార్మిక సంఘాల ధర్నా





**కాకినాడ, (రాజధాని వార్తలు):** కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నవంబర్ 21 నుండి కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్ల అమలును వ్యతిరేకిస్తూ కాకినాడ కలక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి అనంతరం కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల జీవోను ధగ్దం చేశారు. ఈ సందర్భంగా ఏ.పీ.ఎం.ఎస్.ఆర్.యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చివుకుల వెంకటరావు, ఐ.ఎఫ్.టి.యు రాష్ట్ర ఉపాధ్యక్షులు జే.వెంకటేశ్వరులు, ఐ.ఎన్.టి.యు.సి ఏపీ అండ్ తెలంగాణా వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లూరి రాజు, ఎ.ఐ.టి.యు.సి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, ఎ.ఐ.సి.సి.టి.యు రాష్ట్ర కన్వీనర్ గొడుగు సత్యన్నారాయణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పెట్టుబడిదారుల సదస్సు నిర్వహిస్తున్న కేంద్ర ప్రభుత్వం, కార్మికుల సమస్యల ప్రస్తావన చేసే లేబర్ కాన్ఫరెన్స్ నిర్వహణ 2015 నుంచి మానేసి తన వర్గ స్వభావాన్ని చూపించుకుందన్నారు. గతంలో 100 మంది పనిచేసే పరిశ్రమల మూసి వేతకు ప్రభుత్వ అనుమతి తప్పనిసరి చట్టం స్థానంలో లేబర్ కోడ్లలో 300 మంది లోపు పనిచేసే పరిశ్రమలు ప్రభుత్వ అనుమతి లేకుండా లే ఆఫ్, లాక్ ఔట్ చేసి కార్మికుల వేతన బేరసారాల సందర్భంగా పరిశ్రమ మూసివేసి కార్మికుల పోరాటాలను నీరుగార్చేందుకు సహకరిస్తాయని విమర్శించారు. ప్రమాదాల సందర్భంగా ప్రిన్సిపల్ ఎంప్లాయర్ అయిన యజమానికి పరిహారం చెల్లించే భాధ్యత నుండి తీసివేసిందని, ఆన్‌లైన్ యాప్స్‌లో పనిచేసే గిగ్ వర్కర్స్, కోటి మంది పనిచేసే ప్రభుత్వ స్కీం వర్కర్లను కార్మికుల నిర్వచనం నుండి లేబర్ కోడ్లు తొలగించాయని, అన్ని చట్టాలు అమలు చేస్తున్నట్లు యజమాని సొంత పూచీకత్తు ఇస్తే ఎటువంటి చెకింగ్ చేయకుండా చట్టం చేసారని, ఈ 4 లేబర్ కోడ్లు కార్మికుల హక్కుల పాలిట ఉరితాడుగా మరతాయని, నయా బానిసలుగా మారకముందే కార్మికులందరూ ఐక్యంగా బిజెపి ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై రాజకీయ పోరాటానికి సిద్ధపడాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, కోశాధికారి మలకా రమణ, వర్కింగ్ కమిటీ సభ్యులు మెడిశెట్టి వెంకటరమణ, టి.రాజా, అజయ్ కుమార్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు భారతి, ఏ.పీ.ఎం.ఎస్.ఆర్.యు నాయకులు అప్పారావు, వర్మ, నరేష్, చరణ్, మహేష్, శివ, జి.జి.హెచ్ శానిటేషన్ రవి, దుర్గమ్మ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పారెడ్డి, ఐ.ఎఫ్.టి.యు నాయకులు గుబ్బల ఆదినారాయణ, ఆర్.రఘువులు, పి.సత్యన్నారాయణ, శ్రీనివాస్, వినోద్, వీరబాబు, ఐ.ఎన్.టి.యు.సి నాయకులు వి.వి.రమణ, సాయి గణేష్, ఎ.ఐ.ఎఫ్.టి.యు నాయకులు మడికి సత్యం, ఎ.ఐ.టి.యు.సి నాయకులు కె.వి రామయ్య, ఎన్ అనిల్ కుమార్, అప్పారావు, బాలకృష్ణ, గురుమూర్తి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జెడ్పిటిసి సంపదరావును పరామర్శించిన రమణారావు



**అమలాపురం, (రాజధాని వార్తలు):** కాలికి గాయమై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న జెడ్పిటిసి సభ్యుడు గెడ్డం సంపదరావును పలువురు వైసిపి నాయకులు పరామర్శించారు. గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్, అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్ ఆర్సిపి సీనియర్ నాయకులు కుంచే రమణారావు జడ్పిటిసి సంపదరావు నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించి త్వరగా కోలు కోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో వైసిపి నాయకులు కుడుపూడి భరత్, పినిపే జయ రాజ్, శాంతి భూషణ్, నక్కా సంపత్ కుమార్, నేలపూడి సుగంధ కుమార్, పందిరి సుబ్బరాజు, నేరేడుమిల్లి శ్రీను,గంటా లక్ష్మీ ప్రసాద్ ఉన్నారు.

# పెనుగుదురులో ఉచిత వైద్య శిబిరం




**కరప, (రాజధాని వార్తలు):** కరప మండలం, పెనుగుదురులో జనసేన పార్టీ మండల అధ్యక్షులు బండారు మురళి ఆధ్వర్యంలో వాసన్ కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వాసన్ కంటి ఆసుపత్రి మేనేజర్ స్వామి వందనం, మార్కెటింగ్ విభాగం నాగేంద్ర, టెక్నిషియన్ ప్రకాష్ పాల్గొని గ్రామ ప్రజలకు సేవలు అందించారు. కంటి, షుగర్, బీపీ వంటి పరీక్షలను గ్రామస్తులకు పూర్తిగా ఉచితంగా చేపట్టారు. మొత్తం 130 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, వీరిలో 20 మందికి అవసరమైన కంటి శస్త్రచికిత్సల కోసం ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యులు తుమ్మలపల్లి మాచరావు, గ్రామ జనసేన అధ్యక్షులు గంటా నానిబాబు, నీటి సంఘం అధ్యక్షులు తుమ్మలపల్లి గోవింద రాజులు, కూటమి నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. గ్రామ ప్రజల ఆదరణతో శిబిరం విజయవంతంగా ముగిసింది.

# "సీతన్నకు కాకాణి నివాళి"




**కోవూరు, (రాజధాని వార్తలు):** కోవూరు నియోజకవర్గం వైయస్సార్ కాం గ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మేనకూరు సీతారామిరెడ్డి పార్థివ దేహానికి బుచ్చిరెడ్డిపాళెం గ్రామంలోని ఆయన నివాసంలో మాజీ మంత్రివర్యులు నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డితో కలిసి పూల మాల వేసి, నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సీతన్న సేవలను గుర్తు చేసుకున్న మాజీ మంత్రివర్యులు మరియు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్

# తిరుపతి జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశం - ఎంపీ గురుమూర్తి పలు సూచనలు

## - కలత్తూరు గ్రామ పునరుద్ధరణకు కోటి రూపాయల ఎంపీ నిధులు కేటాయిస్తామని ప్రకటన

**తిరుపతి, (రాజధాని వార్తలు):** తిరుపతి జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్య వేక్షణ కమిటీ సమావేశం (దిశ) నేడు తిరుపతి జిల్లా కలెక్టరు సమావేశ మందిరంలో జరిగింది. ఈ సమావేశంలో దిశ కమిటీ ఛైర్మన్ హోదాలో తిరుపతి ఎంపీ గురుమూర్తి పాల్గొన్నారు. తిరుపతి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు సమస్యలు చర్చకు వచ్చాయి. ఇందులో ప్రధానంగా వర్షాకాలం చెరువు కట్టలు బలోపేతం చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను ఎంపీ కోరారు. కలత్తూరులో జరిగిన సంఘటనలు మరెక్కడా పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, అప్రమత్తంగా ఉండాలన్నారు. కలత్తూరు గ్రామ పునరుద్ధరణకు 1 కోటి రూపాయల ఎంపీ నిధులు కేటాయిస్తామని తెలియజేశారు. కలత్తూరు, కలత్తూరు హరిజనవాడ, పాతపాలెం గ్రామాలలో జరిగిన నష్టానికి సరైన పరిహారం అందించాలని ఎంపీ సూచించారు. ఈ వరదలో గ్రామంలోని అందరి ఇళ్లలోని గ్యాసు సిలిండర్లు కూడా కొట్టుకు పోయాయని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారు సిఎస్ఆర్ కింద వారికి మరలా సిలిండర్లు ఉచితంగా




ఇవ్వాలని కోరారు. దళితులు, వెనుకబడిన వర్గాలు ఎక్కువగా నివసించే గ్రామాలను అభివృద్ధి చెందిన ఆదర్శ గ్రామాలుగా మార్చేందుకు ఉద్దేశించిన ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకం కోసం వెచ్చించవలసిన రూ.10 కోట్ల నిధులను ప్రణాళికాబద్ధంగా ఉపయోగించుకోవాలని సూచించారు. సముద్ర తీర ప్రాంతాలలో జల జీవన మిషన్ ద్వారా చేపడుతున్న పనులను వేగవంతం చేయాల్సిందిగా సంబంధిత అధికారులను ఎంపీ సూచించారు. ఎంపీ నిధులతో చేపట్టే పనులకు ఫీజబిలిటీ రిపోర్ట్, బిల్లుల చెల్లింపు ప్రక్రియలో జాప్యం జరుగుతుందని, లోపాలు సరిచేసుకొని ఒక నిర్దిష్టమైన ప్రణాళికా రూపొందించాలని ఆదేశించారు. సాగరమాల రహదారులు నిర్మిస్తున్న ప్రాంతాలలో సర్వీసు రోడ్లు నిర్మించకపోవడం వలన ఆ ప్రాంతాలు అభివృద్ధి సంగతి ఎలా ఉన్నా రైతులు పంట పొలాలలోకి వెళ్లాలన్నా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉందన్నారు. మరోసారి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపవలసిందిగా కలెక్టరుని కోరగా ఆయన తన సమ్మతిని తెలియజేశారు. తిరుపతి జిల్లాలో కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధి (సిఎస్ఆర్) కింద సుమారు రూ.180 కోట్లు ఖర్చు చేయాల్సి ఉండగా, ఎక్కడో ఖర్చు చూపుతున్నారని, కనీసం 40 శాతం నిధులు జిల్లాలో ఖర్చు చేసే విదంగా చర్యలు తీసుకోవాలని కలెక్టరుని కోరారు. ఆ నిధులను అత్యవసర సమయాలలో వినియోగించుకోవచ్చని ఎంపీ తెలిపారు. మునిసిపాలిటీలలో డ్రైనేజి కాలువల నిర్మాణం వేగవంతం చేస్తూ, వర్షాకాలం కాబట్టి అంటువ్యాధులు ప్రబల కుండ పారిశుధ్యంపై దృష్టి సారించాలని పబ్లిక్ హెల్త్ డిపార్ట్మెంట్ వారిని ఎంపీ ఆదేశించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో, వసతి గ్రహాలలో ఆర్ఓ ప్లాంటులు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులని కోరారు. మధ్యాహ్న భోజనంతోపాటు, వసతి గృహాలలో పరిశుభ్రమైన ఆహారం అందించాలన్నారు. గత సంవత్సర కాలంలో నాయుడుపేట, సత్యవేడు, శ్రీకాళహస్తి ప్రాంతాలలోని వసతి గృహాలలోని విద్యార్థులు కలుషితాహారం, కలుషితమైన నీరు వలన అనారోగ్యం బారిన పడ్డారని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్వాడీ పిల్లల్లో జన్యులోపాలతో ఉండే వారిని ఎంత మందిని గుర్తించారని ఎంపీ ప్రశ్నించగా అందుకు అధికారులు సమాధానం ఇస్తూ ప్రస్తుతానికి చంద్రగిరి నియోజకవర్గంలోని మూడు పంచాయితీలలో పైలట్ ప్రాజెక్టు కింద ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఈ ప్రాజెక్టు జిల్లా మొత్తం అమలు చేయాలని ఎంపీ కోరగా విడతాల వారీగా జిల్లా మొత్తం విస్తరిస్తామని జిల్లా కలెక్టరు తెలిపారు.

# మార్కెట్ కమిటీ ఛైర్మన్‌ని ఘనంగా శాలువాతో సన్మానించిన శ్రీకాళహస్తి మైనార్టీ ముస్లిం సహోదరులు



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తి పి ఆర్ గెస్ట్ నందు శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయు డుకు శ్రీకాళహస్తి ముస్లిం సహోదరుల ఘనంగా శాలువాతో సన్మానించి స్వీటు తినిపించడమైనది అదేవిధంగా వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్గా మహమ్మద్ షఫీ కు ఇచ్చినందుకు చైర్మన్ శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, కృతజ్ఞతలు తెలుపుతూ సంతోషాన్ని మైనారిటీలు వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి షాకీర్ అలీ. టౌన్ బ్యాంక్ చైర్మన్. ఖాదర భాష. ముస్లిం నాయకులు ఖలీల్ భాషా. జహీర్ అహ్మద్. మీర్జా. మస్తాన్. ఐ టి డి పి ఖాదర్, షఫీ, మహమ్మద్ రఫీ, నయీమ్,అల్లబక్షు, సాజిద్, ఫుజైల్, సోహైల్, ఆఫ్రిద్,అల్ల బాకష్, ఫకృద్దీన్ టౌన్ ఇర్ఫాన్,బ్యాంక్ డైరెక్టర్ దొరబాబు మాజీ వైస్ చైర్మన్ మిన్నల రవి తదితర నాయకులు పాల్గొన్నారు.

# ప్రశాంతమ్మ పిలుపు మేరకు చెట్లు





**బుచ్చిరెడ్డిపాలెం, (రాజధాని వార్తలు):** కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి జన్మదిన సందర్భంగా బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీలోని 4వ వార్డు శేషాద్రి నగర్ ఏరియాలో మున్సిపల్ చైర్ పర్సన్ మోర్ల సుప్రజ మురళి చెట్లు నాటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే జన్మదిన సందర్భంగా ప్రతి వార్డులో, ప్రతి ఒక్కరు కూడా ఒక మొక్క నాటి ఎమ్మెల్యేకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయాలని, మీరు నాటే ప్రతిమొక్కే ఎమ్మెల్యేకి మనం అందించే అత్యంత విలువైన బహుమతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి బాలకృష్ణ, వైస్ చైర్మన్ ఎరటపల్లి వెంకట శివకుమార్ రెడ్డి, కౌన్సిలర్ రహమత్ భాష, నాలుగో వార్డ్ ఇంచార్జ్ మహిధర్ రెడ్డి, టిడిపి నాయకుడు పఠాన్



మహబూబ్ బాషా, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# చదువుతోపాటు సమాజం, రాజ్యాంగం పట్ల అవగాహన కలిగి ఉండాలి

## - భారత రాజ్యాంగం ఆమోద దినోత్సవ సందర్భంగా, వ్యాచరచన, వక్తృత్వ పోటీలు





**అమలాపురం, (రాజధాని వార్తలు):** విద్యార్థులు చదువుతోపాటు సమాజం పట్ల, రాజ్యాంగం పట్ల అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ న్యాయవాది దేవ రాజేంద్రప్రసాద్ అన్నారు. భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో మలికిపురం ఎంవిఎన్ జెఎస్ ఎండ్ ఆర్ వి ఆర్ డిగ్రీ కళాశాలలో వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించారు. రాజ్యాంగ రచనకు జరిగిన కృషి అనే అంశంపై వ్యాసరచన, ఆధునిక భారత నిర్మాణంలో రాజ్యాంగం యొక్క పాత్ర అనే అంశంపై వక్తృత్వ పోటీలు ఇంగ్లీష్, తెలుగు భాషల లో నిర్వహించారు.

జూనియర్, సీనియర్ విభాగా లుగా ఈ పోటీలను నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ నాయకులు, న్యాయవాది దేవ. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సమాజం పట్ల, రాజ్యాం గం పట్ల అవగాహన కలిగి ఉండాలని, మహానుభావుల త్యాగాల ఫలితంగా మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి రాజ్యాం గాన్ని. అద్భుతంగా రూపొందించారని అన్నారు. కుల మత ప్రాంతీయ విభేదాలు లేకుండా భారతీయులందరూ అన్నదమ్ముల వలె మెలగాలనే ఉద్దేశంతో ఎన్నో హక్కులు రాజ్యాంగంలో కల్పిం చారని వివరించారు. భారత రాజ్యాంగాన్ని సక్రమంగా అమలు చేయవలసిన బాధ్యత పాలకుల పైన మన పైన ఉందని అన్నారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు నవంబర్ 25న జరిగే భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా జరిగే సభలో ముఖ్య అతిథులుగా పాల్గొననున్న రాజోలు శాసనసభ్యులు దేవ వరప్రసాద్, రాష్ట్ర ఎడిషనల్ ఐజి మోకా సత్తిబాబు చేతులు మీదుగా బహుమతులను అందచేస్తారన్నారు. అధిక సంఖ్యలో విద్యార్థిని విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆనంద మాహాని, అధ్యాపకులు నక్క రమేష్, విద్యార్థి సంఘ మాజీ నాయకులు నల్లి శివకుమార్, పోలిశెట్టి గణేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రహదారి భద్రతపై అవగాహనా కార్యక్రమం



**కందుకూరు, (రాజధాని వార్తలు):** కందుకూరు ప్రాంతీయ రవాణా శాఖ అధికారి కార్యాలయంలో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించుట జరిగినది ఈ కార్యక్ర మంలో కందుకూరు ప్రాంతీయ రవాణా శాఖ అధికారిణి టీవీయన్ లక్ష్మీ మాట్లాడుతూ రహదారి భద్రత అనేది ప్రతి పౌరుడు యొక్క ముఖ్యమైన బాధ్యత అని రహదారి భద్రత నియమాలను తూచా తప్పకుండా పాటించిన యడల ఎటువంటి ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చని తెలియజేశారు. ముఖ్యంగా బైక్ నడిపేవాళ్ళు ఓవర్ స్పీడ్ చేయవద్దని డ్రైవింగ్ లైసెన్స్ పొంది ఉన్న తర్వాతే వాహనములను నడుపవలెనని, ప్రతి ఒక్క డ్రైవర్ సోదరుడు మీరు డ్రైవింగ్‌కి వెళ్ళేటప్పుడు గాని డ్రైవింగ్ చేస్తున్నప్పుడు గాని మీరు మీ యొక్క కుటుంబాన్ని గుర్తు చేసుకోవాలని అన్నారు. అదేవిధంగా మీ యొక్క డ్రైవింగ్ డాష్ బోర్డు నందు మీ ఫ్యామిలీ ఫోటో పెట్టుకోవాలని అది చూసినప్పుడన్న మీరు జాగ్రత్తగా డ్రైవ్ చెయ్యగలరని తెలియ చేశారు. అదేవిధంగా ఇటీవల కందుకూరు నియోజకవర్గ పరిధిలో రోడ్డు ప్రమాదములలో ఎక్కువ శాతం ఓవర్ స్పీడ్ వల్ల యువత ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరమని తెలియచేశారు. రోడ్డు భద్రత అంటే ప్రమాదాలను నివారించడం మరియు రహదారి వినియోగదారులను సురక్షితంగా ఉంచడం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా కందుకూరు ఎంవిఐ జె అనిల్ కుమార్, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు డా.శ్రీపతి బాబును సన్మానించిన అధ్యాపకులు



**నాయుడుపేట, (రాజధాని వార్తలు):** తెలుగుదేశం పార్టీలో గత 30 ఏళ్లుగా కార్యకర్త నుండి, నాయకుడిగా పార్టీలో పని చేసినందుకు గుర్తుగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూళ్లూరు పేట నియోజకవర్గానికి చెందిన డా. శ్రీపతి బాబుకు రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులుగా ప్రకటించడం జరిగింది. ఈ నేపథ్యంలో నాయుడుపేట పట్టణ ఉపాధ్యాయులు కల్లూరు గురవయ్య, అల్లెయ్య, మీరయ్యలు పదవిని అలంకరించిన డా.శ్రీపతి బాబును శాలువా కప్పి, పుష్పా బోకేలు బహుకరించి అభినందనలు తెలియజేశారు. తెలుగుదేశం పార్టీలో మరెన్నో ఉన్నత పదవులు అలంకరించి, ప్రజా సేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.

# విజయవంతంగా ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్మెంట్ కార్యక్రమం




**గూడూరు, (రాజధాని వార్తలు):** నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 18వ నుండి 22వ తేదీ వరకు జరిగిన ఆటోమోటివ్ మోడల్స్ డిజైన్ టెస్టింగ్‌పై ఐదు రోజులు ఫాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాము విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ ఇంజినీరింగ్ కళాశాలల అధ్యాపకులు పెద్ద సంఖ్యలో హాజరై చురుకుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డా.విశ్వక్సేనారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యలో నూతన ధోరణులు, పరిశ్రమ అవసరాలు, ఆధునిక వాహన సాంకేతిక పరిజ్ఞానాలను అధ్యాపకులకు పరిచయం చేయడానికి ఉద్దేశించిన డిజైన్ అండ్ టెస్టింగ్ ఆఫ్ ఆటోమోటివ్ మోడల్స్ అనే ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను అధ్యాపకులు దృఢమైన అవగాహన కలిగి ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. మొదటి రోజు ఇ.ఇ.ఇ. విభాగధిపతి డా. కె.పి.ప్రసాద్ రావు వాహనాల స్ట్రక్చరల్ మరియు డైనమిక్ అనాలిసిస్ అంశము పైన మాట్లాడారు. తదుపరి రోజులు డా.డి.రాజేష్ రెడ్డి, కో కన్వీనర్ డా.జగదీష్, స్వర్ణ, శరవణన్ అధ్యాపకులు మోడల్ సిమ్యులేషన్, క్రాష్ టెస్టింగ్ ఫండమెంటల్స్, ఎలక్ట్రిక్ వాహనాల డిజైన్ ప్రాసెస్, వాహన పనితీరు మూల్యాంకనం వంటి అనేక ముఖ్య అంశాలపై ఉపన్యాసాలు అందించారు. ఈ కార్యక్రమంలో (ఎఫ్. డి.పి) వివిధ ఇంజనీరింగ్ కాలేజెస్ నుంచి 50 మంది అధ్యాపకులు మరియు పరిశోధన విద్యార్థులు పాల్గొన్నారు. చివరి రోజు రిసోర్స్ పర్సన్‌గా ఎం రమేష్ ఈ కార్యక్రమంలో ప్రసిద్ధ ఆటోమోటివ్ పరిశ్రమ నిపుణులు, పరిశోధకులు మరియు అకాడమీషియన్లు పాల్గొని వాహన రూపకల్పన, మోడల్ అభివృద్ధి, పనితీరు విశ్లేషణ, సిమ్యులేషన్ ఆధారిత టెస్టింగ్, భద్రతా ప్రమాణాలు, ఎమర్జింగ్ టెక్నాలజీస్ వంటి ముఖ్య అంశాలపై విలువైన సాంకేతిక సెషన్లను అందించారు. ఈ కార్యక్రమానికి కన్వీనర్ ఇ.ఇ.ఇ. విభాగాధిపతి డా.కె. పి. ప్రసాద్‌రావు, కళాశాల డైరెక్టర్ డా.దత్తాత్రేయశర్మ, సెక్రటరీ వినయ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అండ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానసందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS


- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎఫ్లానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి శారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# ఉప ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రాంతాలను కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలన





**అమలాపురం, (రాజధాని వార్తలు):** ఈనెల 26న రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి కె.పవన్ కళ్యాణ్ రాజోలు నియోజకవర్గంలో పర్యటించ నున్న ప్రాంతాలను జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఎస్పీ రాహుల్ మీనా, జాయింట్ కలెక్టర్ నిశాంతి, ఆర్డీఓ మాధవి పరిశీలించారు. హెలిప్యాడ్ నిర్మాణ ప్రాంతం, శంకరగుప్తం మెయిన్ మురికి కాలువ కారణంగా చని పోయిన కొబ్బరి చెట్ల బాధిత రైతులతో మాట్లాడేం దుకు సభాస్థలి ఏర్పాట్లను రాజోలు శాసన సభ్యులు దేవ వరప్రసాద్, జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ టి నిశాంతి, ఆర్డీఓ కె మాధవి, జిల్లా స్థాయి అధికారులతో కలిసి క్షేత్రస్థా యిలో పరిశీలించారు. హెలిప్యాడ్ నిర్మాణానికి అన్ని ఏర్పాట్లు చేపట్టాలని రహదారులు భవనాల శాఖ ఇంజనీర్లను ఆదేశించారు. అలాగే రైతులతో మాట్లాడేందుకు ఏర్పాటు చేసే సభాస్థలి ఏర్పా ట్లను, రాకపోకల మార్గాలను కలెక్టర్, ఎమ్మెల్యేలు పరిశీలించి తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఉప ముఖ్యమంత్రి వర్యులు పర్యటనలో శంకరగుప్తం ప్రధాన మురికి కాలువకు ఆనుకొని ఉన్న 12 గ్రామాలలో చనిపోయిన కొబ్బరి తోటలు పరిశీలన సంబంధించి క్షేత్ర స్థాయి పర్యటన ఏర్పా ట్లపై తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అధికా రులకు సూచించారు. సుమారు 200 మంది బాధిత కొబ్బరి రైతులు సమావేశానికి హాజరయ్యేలా స్థల ఏర్పాట్లు చేపట్టాలని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ఉప ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం అయ్యేలా ఏర్పాట్లు చేపట్టా లని ఆయన జిల్లాయంత్రాంగాన్ని కోరారు. అలాగే శివకోడులో బల్ల రత్నం రాజు లేఅవుట్ స్థలాన్ని రెండోవ హెలిప్యాడ్ ఏర్పా టుకు స్థల పరిశీలన చేశారు. అనంతరం కాపు కళ్యాణ మండపం వద్ద రాష్ట్రస్థాయి పల్లె పండుగ 2.0 సభాస్థలి ఏర్పాట్లను పరిశీలిం చారు. ఈ కార్యక్రమంలో రహదారులు భవనాల శాఖ పంచాయ తీరాజ్, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్లు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు, పోలీస్, రెవెన్యూ, జిల్లాస్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మొబైల్ డ్రైవింగ్ చేస్తే డ్రైవింగ్ లైసెన్స్ సస్పెన్షన్



**తిరుపతి, (రాజధాని వార్తలు):** నగరంలోని మంగళం రోడ్డులో జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ ఆదేశాల మేరకు, సెల్ ఫోన్ వినియోగిస్తూ ద్విచక్ర వాహనాలు నడపుతున్న వారిపై కేసులు నమోదు చేసి, రవాణా శాఖ మోటార్ వాహన తనిఖీ అధికారులు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ తనిఖీలలో 22 ద్విచక్ర వాహనాలపై కేసులు నమోదు చేయడం జరిగింది. చర వాణి వినియోగిస్తూ వాహనం నడుపుతున్న పది ద్విచక్ర వాహనా లపై ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న మరో పది వాహనాలపై మరియు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడుతున్న రెండు వాహనాల పై కేసులునమోదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా మోటార్ వాహనాల తనిఖీ అధికారి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ మోటార్ వాహనాల సెక్షన్ 184 ప్రకారం మొబైల్ ఫోన్ డ్రైవింగ్ చేసేవారికి మొదటిసారిగా 1500 రూపాయలు మరియు రెండవసారి అదే వాహనాన్ని వినియోగిస్తూ మొబైల్ డ్రైవింగ్ చేసిన పక్షంలో 10,000 రూపాయలు వరకు అపరాధ రుసుము ఉంటుందని తెలియజేశారు. మోటార్ వాహనాల తనిఖీ అధికారి అతికా నాజ్ మాట్లాడుతూ మొబైల్ డ్రైవింగ్ చేసే వారి డ్రైవింగ్ లైసెన్స్‌లను మూడు నెలల వరకు సస్పెండ్ చేయటానికి సిఫారసు చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో సహాయ మోటార్ వాహనాల తనిఖీ అధికారి స్వర్ణలత పాల్గొన్నారు.

# ఓపెన్ బ్రిడ్జ్ ఛాంపియన్‌షిప్స్ ప్రారంభించిన శాప్ చైర్మన్




**తిరుపతి, (రాజధాని వార్తలు):** తిరుపతి ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్వహిం చిన 22వ ఓపెన్ బ్రిడ్జ్ ఛాంపియన్‌షిప్స్ కార్యక్రమం ఎంతో వైభవంగా, క్రీడాస్ఫూర్తిని ప్రతిబింబించే రీతిలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు టోర్నమెంట్‌ను ఘనంగా ప్రారంభిం చారు. ఈ సందర్భంగా రవి నాయుడు మాట్లాడుతూ, బ్రిడ్జ్ వంటి క్రీడలు కేవలం గేమ్స్ మాత్రమే కాదు, అవి వ్యక్తిలో మానసిక చురుకుదనం, వ్యూహాత్మక ఆలోచన, సమయోచిత నిర్ణయ సామ ర్థ్యం, సమన్వయ భావన వంటి విలువైన లక్షణాలను పెంచుతా యని పేర్కొన్నారు. ఇలాంటి టోర్నమెంట్లు యువతలో మేధో వికాసానికి తోడ్పడటమే కాక, సామాజికంగా అనుబంధాలను బలోపేతం చేస్తాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ తోట వాసు, టోర్నమెంట్ ఆర్గనైజర్ రవీంద్ర బ్రిడ్జ్ గేమ్ అసోసియేషన్ సభ్యులు నరసింహారావు, నాగరాజు, సత్యరాజు, రమేష్, రవి, గురప్ప, పలువురు కూటమి నాయకులు, బ్రిడ్జ్ క్రీడాకారులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan